

సమకూరింది ధనం.. ఇదిగో సాగర మథనం..



సిబ్బంది సాగర జలాల్లోకి వెళ్లినప్పుడు.. అక్కడి పరిస్థితి వివరిస్తూ..



విశాఖట్నం చేపల రేవులో గత కొన్నాళ్లుగా పూడిక సమస్య నెలకొంది. మునిగిన పడవలు, పేరుకుపోయిన వ్యర్థాలతో ఇక్కడ స్థల సమస్య నెలకొంది. బోట్లను నిలిపేందుకు మత్స్యకారులకు పాట్లు తప్పడం లేదు. దీంతో... విశాఖ పోర్టు అధికారులు భారీగా నిధులు కేటాయించడంతో గత కొన్ని రోజులుగా పూడిక తీత పనులు జోరుగా సాగుతున్నాయి. ఆక్సిజన్ సిలిండర్లు ధరించి సాగర జలాల్లో మునిగి, అలాగే... భారీ క్రేనుతో సాగరంలోని వ్యర్థాలను తీస్తున్న దృశ్యాలను ఇక్కడ చూడొచ్చు.

–ఈనాడు, విశాఖపట్నం

యువతా.. అవకాశం అందిపుచ్చుకో!!

పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తులు ప్రారంభం





ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు నైపుణ్యాలు తప్పనిసరి. అప్పుడే మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఏడాదిపాటు యువతకు పూర్తిస్థాయి వృత్తి నైపుణ్యాలు నేర్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2024 బడ్జెట్‌లో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రకటించింది. దసరా రోజు నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

ఈనాడు, విశాఖపట్నం

నమోదు ఇలా..

pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబర్, బయోడేటాతో నమోదు చేసుకోవాలి. క్యాండిడేట్ ప్రొఫైల్‌లో తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేయాలి. తర్వాత వ్యక్తిగత వివరాలు, కేటగిరీ, చిరునామా తదితరాలు, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు, ప్రత్యామ్నాయ ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ, విద్యార్హతలు, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి. దీనికి ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుము లేదు.

ప్రయోజనం..

దేశంలోని 500 అగ్రశ్రేణి సంస్థల్లో ఇంటర్న్‌షిప్ కింద వృత్తి నైపుణ్యాలు నేర్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు 12 నెలలపాటు రూ.5 వేల చొప్పున అందిస్తారు. ఏకకాల గ్రాంటు కింద రూ.6 వేలు కూడా ఇస్తారు. ఏడాదికి మొత్తం రూ. 66,000 పొందుతారు.

అర్హులెవరంటే..?

ఆన్‌లైన్/దూరవిద్య ప్రోగ్రామ్‌లలో నమోదు చేసుకున్నవారు, ఉన్నత పాఠశాల విద్య పూర్తిచేసి, ఐటీఐ, డిప్లమో, బీఏ, బీఎస్సీ, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఫార్మసీ చదివినవారు.

కావాల్సిన ధ్రువపత్రాలు..

ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు, ఇతర ప్రత్యేక కోర్సులు చేస్తే వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు.

శిక్షణ ఎక్కడ..?

విశాఖ పరిసరాల్లో ప్రభుత్వ రంగ సంస్థలైన ఓఎన్‌జీసీ, ఎన్టీపీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, హెచ్‌పీసీఎల్, బెల్, ప్రైవేటు సంస్థలు రెడ్డీస్, డివీస్ ల్యాబొరేటరీస్, టెక్ మహీంద్ర తదితర సంస్థల్లో శిక్షణకు అవకాశం.

● జిల్లాలో ఏడాదికి దాదాపు 50 వేల మంది ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేస్తున్నారు. చాలా మంది సరైన నైపుణ్యాలు లేకపోవడంతో ప్రముఖ సంస్థల్లో అవకాశాలు కోల్పోతున్నారు. వారికి పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

సందేహాలుంటే..?

హెల్ప్‌లైన్ నంబర్ 1800116090కు ఫోన్ చేయొచ్చు.

వీరు అనర్హులు..

ఐఐటీ, ఐఐఎం, ఐఐఐటీ తదితర ఉన్నత విద్యా సంస్థల్లో చదివిన వారు, ఎంబీఏ, సీఏ, ఎంబీబీఎస్ తదితర ఉన్నత డిగ్రీలు చదివిన వారు, 2023-24 విద్యా సంవత్సరంలో కుటుంబంలో ఏ ఒక్కరి ఆదాయం రూ.8 లక్షలు దాటిన వారు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు.

దరఖాస్తుకు చివరి తేదీ:	ఈ నెల 25
దరఖాస్తుదారుల జాబితా విడుదల:	ఈ నెల 26
ఎంపిక ప్రక్రియ:	27 నుంచి నవంబరు 7 వరకు
అభ్యర్థి అంగీకారానికి గడువు:	నవంబరు 8 నుంచి 15 లోగా
ఇంటర్న్‌షిప్ ప్రారంభం:	డిసెంబరు 2

లక్ష్యం: 21-24 ఏళ్ల యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడం.

దీపావళి దుకాణాల పేరుతో.. దోపిడీ!!

వైకాపాలో చక్రం తిప్పిన వారి గుప్పిట్లోనే మైదానాలు?

ఈ ఏడాదీ ధరల భారం తప్పేలా లేదు!



ఈనాడు–విశాఖపట్నం

దీపావళి దుకాణాల ఏర్పాటు పేరుతో భారీ దోపిడీ సాగుతోంది. వైకాపా హయాంలో చక్రం తిప్పిన 'సిండికేట్' చేతికే మళ్లీ మైదానాలు వెళుతున్నాయి. ఏర్పాట్లు, అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన పేరుతో ఒక్కో దుకాణం నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. చివరికి ఆ ప్రభావం కొనుగోలుదారులపైనే పడనుంది. దీపావళి దుకాణాల ఏర్పాటుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల పాత, కొత్త మైదానాలతో పాటు, హెలిప్యాడ్ గ్రౌండ్‌ను కేటాయించారు. అలాగే ఏఎస్ రాజా కళాశాల మైదానం, మరికొన్ని ఖాళీ స్థలాల్లో ఏర్పాటుకు పోలీసులు, సంబంధిత ఏయూ అధికారులు అనుమతులిచ్చారు. ఏయూలో మూడు మైదానాల్లో కలిపి సుమారు 500-650 దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉంది. అన్ని రకాల వసతులు, అనుమతులకు రెండు రోజులకు రూ.10-20 వేలు ఖర్చు అవుతుంది. అయితే అదనంగా రూ.80వేల వరకూ వసూలు చేస్తున్నారు. 'ఫైర్ సేఫ్టీ' అనుమతులు తక్కువ దుకాణాలకు తీసుకుని ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆ సిండికేట్‌కే నేడు: గత వైకాపా హయాంలో 2022లో ఏయూలో దుకాణాల ఏర్పాటు సమయంలో కొందరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీలో కీలక నేత ఒకరు రంగంలోకి దిగి పంచాయితీ చేశారు. [illegible] దిగుతున్నారు.

● మరో వైపు పాత 'సిండికేట్'తో చేతులు కలిపి ప్రస్తుతం ఓ ముగ్గురు చక్రం తిప్పుతున్నారు. [illegible]

● ఏయూ మైదానాల చుట్టూ జనావాసాలు ఉన్నందున ఇక్కడ బాణసంచా విక్రయాలకు అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశం బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

ఒట్టేసి.. ఒడిసి పట్టారు!

● తిరుమలనగర్ నివాసితుల సమష్టి కృషికి గుర్తింపు
● జాతీయస్థాయిలో 'జల అవార్డు' ప్రకటన



కాలనీలో పచ్చదనం



కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ ఉండదని నిరూపిస్తున్నారీ తిరుమలనగర్ నివాసితుల సంక్షేమ సంఘం సభ్యులు. పర్యావరణ పరిరక్షణ పద్ధతులపై నిత్యం అవగాహన కల్పిస్తూ.. అమలు చేయిస్తున్నారు. చేయి చేయి కలిపి.. అవార్డుల వేట సాగిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిలో ఇప్పటికి 22 అవార్డులు సొంతం చేసుకున్నారు.

న్యూస్‌టుడే, మర్రిపాలెం (తిరుమలనగర్)

విశాఖపట్నం 87వ వార్డు పరిధి తిరుమలనగర్ కాలనీ మొత్తం [illegible] ఉంటుంది. జల, వాయు, శబ్ద కాలుష్యం ఎక్కువగా ఉంటోంది. కాలనీలో ఇల్లు ఎందుకు కట్టుకున్నామా..? ప్లాట్ ఎందుకు కొనుగోలు చేసుకున్నామా..? అంటూ నివాసితులు గగ్గోలు పెట్టేవారు. కానీ, వారంతా ఐక్యంగా ముందుకు కదిలారు. ఆయా సమస్యల్ని ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకున్నారు. చిత్తశుద్ధితో నిర్ణయాలు అమలు చేస్తూ.. నేడు జాతీయ స్థాయిలో అవార్డులు సొంతం చేసుకుంటున్నారు.

భూగర్భ జలాల పెంపుపై దృష్టి: కొన్నేళ్ల కిందట కాలనీలో బోరుబావుల్లో నీటి లభ్యత లేకపోవడంతో కాలనీ సంఘం భూగర్భ జలాల పెంపుపై దృష్టి సారించింది. ఇంకుడు గుంతల వినియోగంపై నివాసితులకు అవగాహన కల్పించి, వాటిని వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం కాలనీ పరిసరాల్లో 50 నుంచి 80 అడుగుల లోతులోనే నీటి వనరులు లభిస్తున్నాయి. 2020లో కేంద్ర జల వనరుల శాఖ నుంచి వాటర్ హీరో అవార్డు, 2022లో జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు ఈ కాలనీకి దక్కాయి.



రహదారి పక్కన ఇంకుడు గుంత



భవనాలు, పచ్చదనంతో తిరుమలనగర్

ఇప్పుడు మరొకటి..: కేంద్ర జలశక్తి శాఖ 2023 సంవత్సరానికిగాను ప్రకటించిన 5వ జాతీయ జల అవార్డుల్లో తిరుమలనగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ 3వ ర్యాంకు దక్కించుకుంది. ఈనెల 22న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డు ప్రదానం చేయనున్నారు.

● కాలనీలో 100 రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టి 16 లక్షల లీటర్ల నీటిని ఆదా చేశారు. పార్కులు, రహదారుల పక్కన 62 ఇంకుడు గుంతలు తవ్వి 30.97 లక్షల లీటర్ల వర్షపు నీటిని ఒడిసిపట్టారు. దీనికి తోడు పరిసర ప్రాంతాల్లో 3 వేల చెట్లను సంరక్షిస్తున్నారు. ఈ సేవల్ని గుర్తించి అవార్డు ప్రకటించారు.

పర్యావరణానికి ప్రాధాన్యం..



కాలనీ సంఘం సభ్యులు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. తరచూ జీవీఎంసీ స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో పాల్గొంటూ, నిత్యం కాలనీలో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో అనేక స్వచ్ఛ అవార్డులూ దక్కాయి. కాలుష్య నియంత్రణకు పార్కుల్లో, ఇంటి పరిసరాల్లో, రహదారుల పక్కన మొక్కల్ని పెంచుతున్నారు. సేంద్రియ ఎరువు తయారీతో పాటు, మిద్దె పంటలూ పండిస్తున్నారు. ప్లాస్టిక్ నియంత్రణ పక్కాగా అమలు చేస్తూ, వస్త్ర, నార సంచుల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంఘం సభ్యులతో పాటు నివాసితులు అన్ని కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ ఫలితాలు సాధిస్తున్నామని నివాసితుల సంఘం సభ్యులు నాగభూషణం, పరమానందం, విశ్వేశ్వరరావు, తదితరులు పేర్కొన్నారు.

క్లిష్ట సమస్యలకు మెడ్‌టెక్‌జోన్‌లో పరిష్కారం



మెడ్‌టెక్‌జోన్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి జయంత్ చౌదరి, జోన్ సీఈవో డా.జితేంద్ర శర్మ తదితరులు

ఈనాడు, విశాఖపట్నం: ఆరోగ్య సంరక్షణలో సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఏపీ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) క్రియాశీల వేదికగా మారిందని కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సహాయ మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు. ఏఎంటీజెడ్‌లో మంగళవారం మాజీ రాష్ట్రపతి దివంగత డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. దీనికి కేంద్ర మంత్రి హాజరయ్యారు. [illegible] ప్రత్యేక వైద్య సంబంధిత కోర్సులు ప్రారంభించేందుకు వైద్య పరికరాల అవసరముందన్నారు. మెడ్‌టెక్ సీఈవో డా.జితేంద్ర శర్మ మాట్లాడుతూ వైద్య ఉపకరణాల తయారీలో భారత్ తిరుగులేని స్థానానికి చేరుకుంటుందన్నారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన వైద్య పరికరాలను ఉచితంగా అందిస్తామన్నారు.

తీరనున్న ఇసుక ఇబ్బందులు

జిల్లాకు 27 రీచ్‌ల కేటాయింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వాసులకు ఇసుక ఇబ్బందులు తీరనున్నాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వెల్లడించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, రాజమహేంద్రవరం జిల్లాల్లో విశాఖకు 27 రీచ్‌లు కేటాయించారని, ఆయా చోట్ల మాన్యువల్ పద్ధతిలో ఇసుక తవ్వకాలు చేపడతారని చెప్పారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేపడుతున్నామని, మరో రెండు, మూడు రోజుల వ్యవధిలో ఆఫ్‌లైన్‌లోనూ బుకింగ్‌లు ఆహ్వానిస్తామన్నారు. నేరుగా రీచ్ వద్దకు వెళ్లినా ఇసుక ఇస్తారన్నారు. ఇంత వరకు 748 బుకింగ్‌లు వచ్చాయని, వాటిలో 126 మినహా మిగిలిన వాటికి ఇసుక అందజేశామన్నారు. ఇసుక ఇబ్బందులపై ఎప్పటికప్పుడు ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని, వాటిని దృష్టిలో ఉంచుకొని తదుపరి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



అమెరికా యుద్ధనౌక
సాగరంలో సాహస విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో భారత్ నౌకాదళం ఆతిథ్యం ఇస్తున్న 'మలబార్-2024' సముద్ర విన్యాసాలు చురుగ్గా సాగుతున్నాయని మంగళవారం నేవీ వర్గాలు తెలిపాయి. 18 వరకు జరిగే సీ-ఫేజ్ విన్యాసాల్లో భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా నౌకాదళాలకు చెందిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, హెలికాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు పాల్గొంటున్నాయని తెలిపాయి.

అన్ని రంగాల్లో.. జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

● సీఎం అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తా
● ఇన్‌ఛార్జి మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా విశాఖ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి వెల్లడించారు. మంగళవారం ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాల్లో విశాఖ గణనీయమైన పురోగతి సాధించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, వాటిని యువత అందిపుచ్చుకొనే వాతావరణం కల్పిస్తామన్నారు.

» జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకెళతానన్నారు. తనకు విశాఖపై అవగాహన ఉందని, 1990 నుంచి 1997 వరకు ఆంధ్ర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివానని, ఇక్కడే హౌస్ సర్జన్ కూడా చేసినట్లు చెప్పారు. తనతో కలిసి చదివిన పలువురు విశాఖలో వైద్యులుగా సేవలందిస్తున్నారని గుర్తు చేసుకున్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని వివరించారు. ముఖ్యమంత్రి అప్పగించిన బాధ్యతలను పక్కాగా నెరవేరుస్తానని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు విశాఖ గుండె వంటిదని, ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి వివరించారు.



ఎలాంటి ముద్ర వేస్తారో..: జిల్లా ఇన్‌ఛార్జిగా మరో ఇద్దరు మంత్రుల పేర్లు బలంగా వినిపించినప్పటికీ శ్రీబాల వీరాంజనేయస్వామి వైపే సీఎం చంద్రబాబు మొగ్గు చూశారు. వైకాపా పాలనలో జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రులుగా మోపిదేవి వెంకటరమణారావు, కురసాల కన్నబాబు, విడదల రజిని పనిచేశారు. అయినప్పటికీ పెత్తనం మాత్రం నాటి వైకాపా ప్రాంతీయ సమన్వయకర్తల చేతుల్లోనే ఉండేది. సమీక్ష సమావేశాల్లో సైతం వారే హడావుడి చేసేవారు. దీంతో నాటి ఇన్‌ఛార్జి మంత్రులు పెద్దగా చేసిందేమీ లేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా వస్తున్న శ్రీబాల వీరాంజనేయస్వామి ఎలాంటి పనితీరు కనబరుస్తారనే విషయమై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సిరిమానుపై ఇలవేల్పు వైభోగం



సిరిమాను ఊరేగింపులో భక్తులు

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్: సిరులతల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం మంగళవారం వైభవంగా సాగింది. పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించగా.. భక్తులు మొక్కులు చెల్లించారు. వేలామంది మహిళలు ఘటాలతో తరలివచ్చారు. కొందరు గొర్రెలు, మేకలు, కోళ్లను తల్లికి సమర్పించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సంధ్యారాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణరాజు, అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, బేబినాయన, కోళ్ల లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లు.. చలో అధ్యయన యాత్ర

ఒక్కొక్కరికి రూ.1.19 లక్షల వ్యయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు సిద్ధమవుతున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి 8 రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుంది. ఇప్పటి వరకు 85 మంది కార్పొరేటర్లు అంగీకారం తెలిపారు. సీపీఎం, జనసేన కార్పొరేటర్లు గంగారావు, పీతల మూర్తియాదవ్ తాము యాత్రకు రావడం లేదని లేఖలు సమర్పించారు. యాత్రలు విహారాలుగా మిగులుతున్నాయే తప్ప, అధ్యయనం జరగడంలేదని వారు ఆరోపిస్తున్నారు. వైకాపా హయాంలో రెండుసార్లు నిర్వహించిన అధ్యయన యాత్రలకు రూ.2.7కోట్లు వ్యయం చేశారు. అయినా నగరంలో ఒక్క కొత్త ప్రాజెక్టును ప్రారంభించలేకపోయారు. ప్రజలకు ఉపయుక్తమైన విధానాలను అమలు చేయలేకపోయారు. యాత్రలతో ప్రజాధనం వృథా అవుతోందని నాడు తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ తరుణంలో ఈ ఏడాది కూడా యాత్రకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.1.19లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు జీవీఎంసీ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది. ఇద్దరు గుత్తేదారులు పాల్గొనగా, ఒక్కో కార్పొరేటర్‌కు రూ.1.19 లక్షలు వ్యయం చేయడానికి ఓ గుత్తేదారు కోట్ చేశారు. ఆయనకే టెండరు అప్పగించే అవకాశం ఉంది. దీనిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీరు మత్స్యరాజు తెలిపారు. జీవీఎంసీ నుంచి కార్పొరేటర్లు, సిబ్బంది 120 మంది వరకు బెంగళూరు, మైసూరు, బందీపూర్, ఊటీ, గోవా, పనాజీ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగనున్న ఈ యాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వైకాపా హయాంలో మాదిరిగా విహార యాత్రలు చేస్తారా.. లేదా నగరానికి ఉపయోగపడేలా కొత్త ఆలోచనలతో వస్తారా అనే చర్చ నడుస్తోంది.

ఐసీజీ డైరెక్టర్ జనరల్‌గా పరమేశ్ శివమణి



సింధియా, న్యూస్‌టుడే: భారతీయ తీరగస్తీ దళం (ఐసీజీ) 26వ డైరెక్టర్ జనరల్‌గా పరమేశ్ శివమణి నియమితులయ్యారని మంగళవారం ఐసీజీ వర్గాలు తెలిపాయి. ఆయన మూడున్నర దశాబ్దాలుగా తీరప్రాంత పరిరక్షణ విధుల్లో ప్రతిభ చూపారని పేర్కొన్నాయి. కోస్టుగార్డు వెసెల్ 'సమర్', ఆఫ్‌షోర్ గస్తీ వెసెల్ 'విశ్వస్త్'లో పని చేశారని, తూర్పు, పశ్చిమ ప్రాంత కమాండ్ పరిధిలోనూ విధులు చేపట్టారని వెల్లడించాయి. దిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కళాశాల, వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారని స్పష్టం చేశాయి. ఆయనకు 2014లో తటరక్షక్ పతకం, 2019లో రాష్ట్రపతి తటరక్షక్ పతకం దక్కాయి.

చిన్నారులకు ప్రత్యేకంగా దంత ఆసుపత్రి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: చిన్నారుల దంత సమస్యలపై ప్రత్యేక వైద్య విభాగం విశాఖలో ఏర్పాటు చేయడం సంతోషకరమని విశాఖ పార్లమెంటు సభ్యులు శ్రీభరత్ అన్నారు. విశాఖ వ ఆసుపత్రి దరి 'టైనీ టీత్' పేరుతో ఏర్పాటు చేసిన డెంటల్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో దంత సమస్యలు ముందుగా గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు. క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్ అపూర్వ మాట్లాడుతూ.. పిల్లల కోసం నగరంలో మొదటిసారిగా క్లినిక్ ప్రారంభించామన్నారు. పిల్లలతో పాటు పెద్దలకు కూడా వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్యరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్వాహకులతో ఎంపీ శ్రీభరత్

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: బుధ, గురువారాల్లో జరగాలసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ తెలిపారు. దీనిపై అమరావతి సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. అన్ని మండలాల విద్యా శాఖాధికారులు తమ పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. తదుపరి ఎప్పుడు నిర్వహించనున్నది ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలు బట్టి సమాచారం ఇస్తామన్నారు.

నొప్పి తగ్గించి.. స్వస్థత చేకూర్చి..!

శస్త్రచికిత్సల్లో మత్తు వైద్యుల కీలకపాత్ర | నేడు ఎనస్థీషియా దినోత్సవం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వాహన చోదకులు తీవ్ర నొప్పితో విలవిల్లాడుతుంటారు. అలాంటి స్థితిలో వైద్యులు శస్త్రచికిత్స చేయాలంటే కష్టమే. దీనికి మత్తు వైద్యం సహాయం తీసుకుంటారు. వీరు క్షతగాత్రులకు తగిన మోతాదులో మత్తు ఇచ్చి నొప్పిలేకుండా చేస్తారు. ఈ మత్తు ఎక్కువైనా ప్రమాదమే. అందుకే బాధితుడి శరీరస్థితిని అనుసరించి నిపుణులు మత్తు ఇస్తుంటారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడే వారికి కృత్రిమశ్వాస కల్పించడం వరకు ప్రతి వైద్య ప్రక్రియలో మత్తు వైద్యులు లేకుండా ప్రక్రియ ముందుకు కదలదు. కోవిడ్ సమయంలో సైతం ఎనలేని సేవలందించారు. బుధవారం ప్రపంచ ఎనస్థీషియా (మత్తు) దినోత్సవం. ఈ సందర్భంగా శస్త్రచికిత్స, ఇతర ప్రాణాపాయ సమయంలో మత్తు వైద్యం ఎలాంటి పాత్ర పోషిస్తుందో నిపుణులు వివరిస్తున్నారు.

నగరంలో నిపుణుల కొరత

- నగరంలో 350 మంది వరకు మత్తు వైద్య నిపుణులు ఉన్నారు. ప్రస్తుతం వైద్య కళాశాలలు పెరిగిన దృష్ట్యా వీరి సంఖ్య ఇంకా పెరగాల్సి ఉంది. కేజీహెచ్‌లో అత్యాధునిక ఐసీయూ యూనిట్లు.. వాటిల్లో వెంటిలేటర్లు పడకలు ఉన్నాయి. వాటి నిర్వహణ యావత్తు మత్తు వైద్య నిపుణులే పర్యవేక్షిస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందే బాధితులకు కృత్రిమ శ్వాస కల్పించడం, ముక్కు ద్వారా గొట్టాలు పంపి ఆహారం అందివ్వడం, శరీర అవయవాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బాధితులు ఊపిరి తీసుకోవడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు.

చికిత్స ఎలా అందిస్తారంటే..

- నాన్ ఇన్వాసివ్ వెంటిలేషన్ (ఎన్ఐవీ), హైఫ్లో నేసల్ క్యాన్యులా (హెచ్ఎఫ్ఎన్సీ) ఆక్సిజన్ థెరపీ, వెంటిలేటర్ల సహాయంతో మత్తు వైద్య నిపుణులు చికిత్స అందిస్తారు. ఇవన్నీ కృత్రిమ శ్వాస కల్పించేందుకు వినియోగించే యంత్రాలు. ఒక్క కేజీహెచ్‌లో 130 వరకు వెంటిలేటర్లతోపాటు పదుల సంఖ్యలో ఎన్ఐవీ, హెచ్ఎఫ్ఎన్సీ పరికరాలు ఉన్నాయి.
- ఆపరేషన్ థియేటర్లలో చేసే తేలికపాటి చికిత్సల నుంచి గుండె శస్త్రచికిత్సల వరకు ఏదైనా మత్తు వైద్యులు పర్యవేక్షణలో జరగాల్సిందే. రోగులను చికిత్సకు సంసిద్ధం చేయడం కూడా వీరి వంతే. ఆ సమయంలో గుండె పనితీరు, రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ శాతం, శరీర ఉష్ణోగ్రత, రెస్పిరేషన్, తదితరాలు సమాన స్థాయిలో ఉండేలా వీరు జాగ్రత్తలు తీసుకుంటారు.
- ఎనస్థీషియా బాయిల్ ఆపరేటర్ల, పల్స్ ఆక్సీమీటర్లు, క్యాప్నోగ్రఫ్, మల్టీ పారామీటర్ మానిటర్లు వంటి పరికరాల సహాయంతో వైద్యం అందిస్తారు. నొప్పి తెలియకుండా పెయిన్ లెస్ క్లినిక్కులను నిర్వహిస్తారు. ఇటువంటి కేజీహెచ్ ప్రసూతి విభాగంలో అందుబాటులో ఉన్నాయి. గర్భిణులకు ఈ విధానంలో నొప్పి తెలియకుండా ప్రసవమయ్యేలా చూస్తారు.



ఎనస్థీషియా బాయిలర్ ఆపరేటర్ పరికరం



బాధితుడికి కృత్రిమ శ్వాస అందిస్తున్న మత్తు వైద్యులు

సీపీఆర్‌పై అవగాహనలో ముందంజ



సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిటేషన్) ప్రక్రియపై అవగాహన కల్పించడంలో మత్తు వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. నడుస్తూ కొంత మంది కుప్పకూలిపోతారు. వారికి వెంటనే సీపీఆర్ చేసే నిమిషాల వ్యవధిలో ఆసుపత్రికి తరలిస్తే బతకడానికి అవకాశం ఉంటుంది. గుండెను అదిమే ప్రక్రియనే సీపీఆర్ అంటారు. ఈ ప్రక్రియపై ఉత్తరాంధ్ర జిల్లాల్లో 25 వేల మంది వరకు అవగాహన కల్పించాం. వీరిలో 15వేల మంది పారామెడికల్ సిబ్బంది ఉన్నారు.

– డాక్టర్ చింతలపూడి రాకేష్, విభాగ ఆచార్యులు, ఆంధ్ర వైద్యకళాశాల

25లోగా మూడు పేర్లు పంపించండి!

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పోస్టు భర్తీలో భాగంగా ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసింది. సెర్చ్ కమిటీలో విశ్వవిద్యాలయాల నుంచి ఒక సభ్యుడు ఉంటారు. ఆ సభ్యుని పేరుకు సంబంధించి ఏయూ నుంచి పేరు పంపించాలని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల ముగ్గురు పేర్లు ఈనెల 25 లోగా పంపించాలని ఏయూకి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిసింది. ఈ ముగ్గురిలో ఒకరిని ప్రభుత్వం నియమించే సెర్చ్ కమిటీలో నియమిస్తారు. ఉపకులపతుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవడానికి గడువు గత నెల 28తో ముగిసిన విషయం విదితమే. ఏయూలో ఉపకులపతి పోస్టు కోసం 52 దరఖాస్తులు అందినట్లు తెలిసింది. వీరిలో కొంతమంది తమకు తెలిసిన రాజకీయ నాయకుల ద్వారా ఇప్పటికే పైరవీలు ప్రారంభించారు. నవంబరు నెలలో కొత్త ఉపకులపతి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు విశాఖ జట్టు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు విశాఖ జట్టు ఎంపికైంది. గుంటూరులో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎంపికైన జట్టును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాల్లోయట్ అభినందించారు. పోటీల్లో సత్తా చాటి విశాఖ పేరు నిలబెట్టాలని క్రీడాకారులను కోరారు.



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ జూన్ గాల్లోయట్

దిల్లీ బృందం డి.ఎం.హెచ్.ఒ కార్యాలయం సందర్శన

సీతంపేట, న్యూస్‌టుడే: జిల్లాలో క్షేత్రస్థాయి ఆరోగ్య కేంద్రాలలో ఏవిధంగా దయాగ్నోసిస్ జరుగుతుందో తెలుసుకునేందుకు దిల్లీ నుంచి వచ్చిన బృందం డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావుతో మంగళవారం ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ... వివరాలను సేకరించారు. వారితో పాటు డాక్టర్ ఎన్.వి.సమత, డాక్టర్ బాలాజీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బృందంతో మాట్లాడుతున్న డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు



బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉత్తర నియోజకవర్గం 24వ వార్డులో సుడిగాలి పర్యటన చేశారు. రేసపువానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రం, యూపీహెచ్‌సీ, టీపీటీ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టిక, సరుకుల వివరాలను పరిశీలించారు. పిల్లల పేర్లు నమోదు చేసే రిజిస్టర్లను తనిఖీ చేశారు. పక్కన ఉన్న యూపీహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆపై టీపీటీ కాలనీ దరి ఎంపీయూపీ పాఠశాలలో పర్యటించారు. అక్కడ ఏడో తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రదర్శించిన పఠనా సామర్థ్యాలను, ఆంగ్లంలో మాట్లాడిన తీరు, గణితంలో చూపిన ప్రతిభకు ఆయన ఎంతో సంతోషించారు. ఇంకా బాగా చదివి మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. తరగతి గదికి వెళ్లి అప్పటి వరకు చదివిన సిలబస్‌పై విద్యార్థులకు పలు కోణాల్లో ప్రశ్నలు వేశారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, అంగన్వాడీ అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



కుదిరితే బేరం... లేకపోతే బెదిరింపులు

నేటి నుంచి నూతన దుకాణాల్లో మద్యం విక్రయాలు ప్రారంభం

మాధవధార, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల గడువు మంగళవారంతో ముగియడంతో, బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అందుబాటులోకి రానున్నది. మంగళవారం నాటికి విక్రయం కాగా మిగిలిన స్టాకు మొత్తాన్ని డిపోలకు అందజేయాలని ఇప్పటికే మద్యం దుకాణాల సూపర్‌వైజర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు ఎక్సైజ్ డీసీ డి.శ్రీరామ చంద్రమూర్తి తెలియజేశారు. నగరంలో ఉన్న 136 ప్రభుత్వ దుకాణాలను అన్నింటినీ బుధవారం ఖాళీ చేయించనున్నట్లు ఆయన తెలిపారు. లాటరీ ద్వారా దుకాణాలను పొందిన వారికి డిపోల వద్ద వారికి సరకు అందజేస్తున్నామని, బుధవారం నుంచి వారు విక్రయించుకోవచ్చన్నారు. లైసెన్సు పొందిన దుకాణదారులు ఇప్పటికిప్పుడే ఎక్కడా దుకాణం దొరకపోతే, వారు రోజువారీగా ఎక్కడైనా దుకాణం తెరిచే అద్దెకు తీసుకొని విక్రయించుకోవచ్చునని, ఆ తర్వాత శాశ్వతంగా దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చునని ఆయన తెలియజేశారు. నూతన మద్యం పాలసీ ప్రకారం బుధవారం నుంచి కొత్త మద్యం విక్రయం చుకోవచ్చునని తెలిపారు.


★ **మొదటి విడత ఫీజుల రూపంలో రూ.40.48 కోట్లు:** ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 331 మద్యం దుకాణాలకు సంబంధించి, లాటరీ ద్వారా దుకాణాలను దక్కించుకున్న వ్యాపారుల నుంచి మొదటి విడత లైసెన్సు ఫీజుల కింద రూ.40.48 కోట్లు వసూలు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు. విశాఖ జిల్లాలో 155 దుకాణాలకు రూ.21.46 కోట్లు, అనకాపల్లి జిల్లాకు రూ.14.5 కోట్లు, అల్లూరి జిల్లాకు రూ.3.5కోట్లు పైగా వసూలైంది.

★ **అడుగడుగునా ఆటంకాలు:** ఏటువంటి సిండికేట్‌తో సంబంధం లేకుండా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకొని లాటరీ ద్వారా షాపులు దక్కించుకున్న వారికి దుకాణాల ప్రారంభానికి అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. షాపులు వదిలేయాలని సిండికేట్లు ముందుగా బేరాలు ఆడుతున్నారు. వినకపోతే కొన్ని చోట్ల బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే నగరంలో ఉన్న పలు మద్యం దుకాణాలు పలువురు సిండికేట్లు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఒక్కరే అంత పెట్టుబడి పెట్టలేరని, తమకు షాపు వదిలేస్తే గుడ్‌విల్ కింద డబ్బులు ఇస్తామని కొంత మంది వారితో బేరసారాలు ఆడుతున్నారు. ఇప్పటికిప్పుడు షాపుల కోసం ప్రాంగణం చూసుకోవడం, సరకు, పెట్టుబడి, తదితర వాటికి రూ.50లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. తమకు షాపు వదిలేస్తే రూ. కోటి వరకు ఇస్తామని పలువురు సిండికేట్లు ఆఫర్లు ఇస్తున్నారు. కొండరైతే దరఖాస్తుదారు చెల్లించిన రూ.2 లక్షల రుసుముతో పాటు, లైసెన్సు ఫీజులో పది శాతాన్ని చెల్లిస్తామని ఆశ చూపుతున్నారు. సిండికేట్ల మాట వినకుండా వ్యతిరేకంగా షాపులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్న వ్యాపారుల పట్ల కొన్ని చోట్ల రౌడీషీటర్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారు.

★ **రూ.99 మద్యానికి వారం రోజులు పట్టే అవకాశం:** నేటి నుంచి నూతన మద్యం విధానం అందుబాటులోకి వస్తుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఎదురుచూస్తున్న రూ.99 మద్యం విక్రయాలకు మరో వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. తయారీ, డిపోలకు వచ్చేందుకు సమయం పడుతుందని చెబుతున్నారు.



బిర్లా జంక్షన్ వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం



కొడుకు చేతిలో తండ్రి హతం

డబ్బులు ఇవ్వలేదని ఘాతుకం

వేపగుంట, న్యూస్‌టుడే: కుటుంబంతో సరదాగా గడిపేందుకు దసరా పండుగకు ఇంటికొచ్చిన ఓ తండ్రి తనయుడి చేతిలో దారుణ హత్యకు గురైన ఉదంతమిది. గొర్రె పిల్లను అమ్మగా వచ్చిన డబ్బులు అడిగితే ఇవ్వలేదని అత్యంత కిరాతకంగా కత్తితో గొంతుకోసి మరీ ఈ దారుణానికి ఒడిగట్టిన ఘటన నరవ పరిధి మన్నెపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. పెందుర్తి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మన్నెపాలెంలో యంగలి దేవుడు (60), భార్య దేవి, కుమారులు గోపీ, అచ్యుతరావు కలిసి నివసిస్తున్నారు. దేవుడు తోట పనులు చేసేందుకు తెలంగాణ ప్రాంతానికి వెళ్లి వస్తుంటారు. భార్య స్థానికంగా కూలి పనులు చేయగా.. చిన్న కుమారుడు గోపీ (25) తనకు నచ్చితే బిల్డింగ్ సెంట్రింగ్ పనులకు వెళ్తుంటాడు. పెద్ద కుమారుడు అచ్యుతరావు ప్రయివేటుగా భూముల సర్వేలు చేస్తుంటారు. దసరా పండుగకు కుటుంబంతో సరదాగా గడిపేందుకు దేవుడు ఇంటికొచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో గోపీ ఇంట్లో ఉన్న తండ్రితో గొడవపడ్డాడు. ఇటీవల ఒక గొర్రె పిల్లను దేవుడు అమ్మగా ఆ డబ్బులు ఇవ్వమని గోపీ పట్టుపట్టాడు. తండ్రి నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన గోపీ క్షణికావేశంలో తండ్రిని మంచంపై పడేసి అత్యంత కిరాతకంగా కత్తితో గొంతు కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. దేవుడు రక్తపు మడుగులో పడి ఉండడంతో పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. మద్యానికి బానిసై చేతిలో డబ్బులు లేకపోవడంతో తండ్రితో గొడవపడి ఇంతటి దారుణానికి పాల్పడినట్లు కాలనీవాసులు చెబుతున్నారు.



యంగలి దేవుడు (పాతచిత్రం) నిందితుడు గోపి (పాతచిత్రం)

కారు ఢీకొని కాపలాదారు దుర్మరణం

తగరపువలస, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ కాపలాదారు మృతి చెందినట్లు భీమిలి ఎస్.ఐ. జి.హరీశ్ తెలిపారు. ఆ వివరాలిలా.. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కాటూరుపల్లికి చెందిన దాకమర్రి శ్రీను(40) భీమిలి అప్పికొండవీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. విజయదశమిని పురస్కరించుకుని భార్య రమణమ్మ, కుమారులు దీపక్, సందీప్, తండ్రి సూరితో కలసి ఈ నెల 13వ తేదీన విజయవాడ కనకదుర్గ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 14వ తేదీన రాత్రి తగరపువలస బైపాస్‌రోడ్డు గోస్తనీ కూడలి వద్ద అంతా బస్సు దిగారు. కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వైపు వేగంగా వెళుతున్న ఓ కారు శ్రీనును ఢీకొనడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే అతడు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. పేర్కొన్నారు.



దాకమర్రి శ్రీను (పాతచిత్రం)

ఏఆర్ కానిస్టేబుల్ అదృశ్యం

మాధవధార, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఒక ఏ.ఆర్.కానిస్టేబుల్ అదృశ్యమయ్యాడు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మురళీనగర్ ఎన్‌జీజీఓఎస్ కాలనీ, పీఆర్ గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న గేదల సంజీవ నాయుడు (32) ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న ఉదయం విజయవాడలో డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చాడు. అనంతరం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేసినా అది పనిచేయలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారిని వాకబు చేసినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని అందుకే ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. భార్య సాయి శ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జి.సంజీవ నాయుడు (పాతచిత్రం)

కాలువలో పడి.. కార్మికుడి మృతి

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కు ఒప్పంద కార్మికుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన ఘటనపై మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలివి. పెదగంట్యాడ సమీప సిద్ధేశ్వరంలో నివాసం ఉంటున్న అశోక్‌రెడ్డి(29) ఉక్కు సింటర్‌ప్లాంట్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నారు. సోమవారం బి-షిఫ్ట్ విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. ఆ సమయంలో కురిసిన భారీ వర్షానికి వాహనం అదుపుతప్పింది. దీంతో ఆయన రోడ్డు పక్కనే ఉన్న కాలువలో పడిపోయి, వరద వేగానికి కొంతదూరం కొట్టుకుపోయి మృతి చెందారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కేశవరావు తెలిపారు.



అశోక్‌రెడ్డి (పాతచిత్రం)

జాయ్ జెమీయా వలలో మరో బాధితుడు | ఎయిర్‌పోర్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు

మాధవధార, న్యూస్‌టుడే: హనీట్రాప్ నిందితురాలు కొరుప్రోలు జాయ్ జెమీయా వలలో చిక్కుకొని మరో వ్యక్తి ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌కు చెందిన బాధితుడు నగరంలో ఒక కంపెనీలో పనిచేసేవాడు. కంపెనీ యజమాని బంధువుగా వచ్చిన జాయ్ జెమీయా ప్రాజెక్టు హెడ్‌గా తనను నియమించారని, వర్క్ కోసం ప్రతి రోజు బాధితుడి వద్దకు వచ్చి పరిచయం పెంచుకుంది. బాధితుడి ముఖంపై మత్తు స్ప్రే చల్లి, జ్యూస్‌లో మత్తు మందు ఇచ్చి ఆమెతో సన్నిహితంగా ఉన్నట్లుగా ఫొటోలు తీసింది. అప్పటి నుంచి ప్రతిసారీ వేధింపులకు గురిచేస్తూ, అందినకాడికి దోచుకుంది. నగదు ఇవ్వలేని పక్షంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను అతడి భార్య, బంధువులకు పంపిస్తానని బెదిరించేది. దీంతో ఆమె అడిగినంత నగదును ఇచ్చేవాడు. చివరిగా రూ.3 కోట్లు ఇస్తే పూర్తిగా వదిలేస్తానని చెప్పడంతో, ఆ నగదు సమకూరుస్తానని నమ్మబలికి బంగారం, డబ్బులు, ల్యాప్‌టాప్ తీసుకొని హైదరాబాద్ వెళుతుండగా అది తెలుసుకుని మార్గ మధ్యలో బాధితుడి కారుని ఆపి, అతడి వద్ద ఉన్న వస్తువులన్నీ లాక్కొని కత్తితో చంపేందుకు ఆమె, ఆమె సహచరులు ప్రయత్నించారు. దీంతో వెంటనే వారి నుంచి తప్పించుకొని బాధితుడు హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఆమె చేతిలో మోసపోయిన ఎన్ఐఆర్ యువకుడి ఘటన వెలుగులోకి వచ్చి ఆమెను పోలీసులు అరెస్ట్ చేయడంతో, బాధితుడు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడు నుంచి పోలీసులు వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

18న కొబ్బరి చిప్పలు, తల నీలాలకు వేలం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం లింగాలతిరుగుడు సోమలింగేశ్వర స్వామికి కార్తిక మాసంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 01 వరకు (29 రోజులకు) భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు, తల నీలాలు పోగు చేసుకొనేందుకు ఈనెల 18న ఉదయం 11 గంటలకు వేలం వేయడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి బి.మురళి తెలిపారు. ఇందుకు ఆసక్తి ఉన్నవారు కొబ్బరి చిప్పలకు రూ.5000, తల నీలాలకు రూ.1000 ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని వివరించారు. హెచ్చు పాట పాడుకునేవారు పాడుకున్న పైకాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే

సమస్య: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద కుక్కల బెడద అధికంగా ఉంది. - నాయుడు, స్థానికులు

సమాధానం: పరిశీలించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం - ధర్మారావు, ఈవోపీఆర్‌డీ, పరవాడ

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

ఎటు చూసినా గుంతలు.. అంతులేని వెతలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 పరిధిలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులు ప్రారంభమై ఏళ్లు గడిచిపోతున్నా నేటికీ వెతలు వేధిస్తూనే ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. యూజీడీ పనుల కారణంగా అంతులేని అవస్థలు మిగిలాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాగున్న రోడ్లే పాడైపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే దినదిన గండంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నివాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు


ప్రసాద్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా గోతులు

ఇక్కడ మరీ దారుణం..

జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీ ఆరు లేఅవుట్‌ల సముదాయం. ఇక్కడ భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులు జరిగి సంవత్సరాలు గడిచిపోతున్నా అవస్థలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. భూమిలో గొట్టాలు అమర్చేందుకు పలుమార్లు రోడ్లు తవ్వేశారు. తిరిగి పూడ్చడంలో అలసత్వం వహించడంతో ఎక్కడ చూసినా గోతులే కనిపిస్తున్నాయి. అడుగు తీసి అడుగేయాలంటే భయపడాల్సిన దుస్థితి నెలకొంది.


పూర్తిగా ధ్వంసమైన ప్రసాద్‌నగర్ రహదారి

వర్షం కురిస్తే గండాలే..

వర్షాలు కురిస్తే శ్రమశక్తినగర్ వాసులకు గండాలు ఆహ్వానిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కాలనీలో అధికంగా వృద్ధులు నివాసముంటున్నారు. ఇక్కడ శివాలయానికి రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం కురిసిన వారం రోజుల వరకు బురద, నీరు నిలిచిపోయి అవస్థలమయంగా మారుతోందని వాపోయారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గోతుల్లో నీరు నిలిచి తీవ్ర అసౌకర్యంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు బాగుచేయాలని వారంతా కోరుతున్నారు.


శ్రమశక్తినగర్‌లో ఓ కూడలి వద్ద ఇలా..

ఎట్టకేలకు వెలిగిన వీధిదీపం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ అపోలో ఫార్మసీ వెనుక ప్రాంతంలో వీధి దీపం వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ప్రచురితమైన కథనానికి వార్డు ఏఈ శివరామ్ ప్రసాద్ స్పందించి తక్షణమే వీధి దీపానికి మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

నేడు పంచకర్ల పరవాడ సందర్శన

పరవాడ, న్యూస్‌టుడే: పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పరవాడ మండలంలోని పెదముషిడివాడ, కన్నూరు, తానాం, భరణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లెవానిపాలెం, ఈబోనంగి, పి.భోనంగి పంచాయతీల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని కూటమి నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తారన్నారు.

నిండిన నిర్లక్ష్యం


ట్యాంకు నుంచి వృథాగా పోతున్న జలం


ప్రధాన రహదారిపైకి చేరిన నీరు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెన్నెలపాలెంలోని రక్షిత మంచి నీటి ట్యాంకు నుంచి మంగళవారం పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పారింది. సాలిడ్ వేస్టు మెనేజ్‌మెంట్‌కు సమీపంలోని కొండపై ఉన్న ఈ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ట్యాంకు నిండి గంటల కొద్దీ నీరు బయటకి పోవడంతో పాటు కొండదిగువకు చేరి ప్రధాన రహదారి పైకి పారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జరుగుతోందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గల్లంతైన వృద్ధుడి మృతి

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం వి.జుత్తాడ పంచాయతీ పరిధిలోని దువ్వపాలెం చెరువులో సోమవారం సాయంత్రం గల్లంతైన వృద్ధుడు మంగళవారం శవమై తేలాడు. పెందుర్తి ఎస్ఐ అసిరితాత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యర్ర సన్యాసిరావు (65) బహిర్భూమికి వెళ్లి చెరువులో జారి పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్, ఎస్ఐ అసిరితాత ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు అర్ధరాత్రి 1 గంట వరకు చెరువులో వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఆ క్రమంలో మంగళవారం వృద్ధుడి మృతదేహం చెరువులో తేలడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అసిరితాత తెలిపారు.

తీరానికి కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం

పరవాడ: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరానికి మంగళవారం ఉదయం గుర్తు తెలియని పురుష మృతదేహం కొట్టుకొచ్చింది. పరవాడ సీ.ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తీరానికి మృతదేహం కొట్టుకొచ్చిందని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండడంతో పాటు శరీరంపై ఎటువంటి దుస్తులు లేవు. సుమారు 20 నుంచి 30 రోజులు క్రితం మృతి చెంది ఉండొచ్చు. చేతులపై పచ్చబొట్టు గుర్తులు ఉన్నాయి. కుడి చేతిపై ఫ్లయింగ్ ఈగిల్ చిత్రం, 27, ఎస్, డబ్ల్యూ, ఎఫ్ ఆంగ్ల అక్షరాలు రాసి ఉన్నాయి. ఎడమచేతి వైపు 8.. కుడి చేతి చూపుడు వేలు వద్ద పీఆర్ అని ఆంగ్లంలో ఉంది. ఇతను తీరంలో మునిగిపోయి మృతి చెందాడా.. ఎక్కడి నుంచైనా మృతదేహం కొట్టుకొచ్చిందా అన్నది తెలియరాలేదు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో పోలీసులు భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

సుజాతనగర్ (పెందుర్తి): భారత మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని మంగళవారం ప్రపంచ విద్యార్థుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో విద్యార్థులు భారీ కలాం చిత్రాన్ని గీసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలో సినిమా చూడటానికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెందుర్తి ఏఎస్ఐ డీఎస్ఎన్ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి రాతిచెరువు దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన **దాడి ప్రసాదరావు** (54) ఛత్తీస్‌గఢ్‌లోని ఉక్కు పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటారు. సెలవుపై ఈ నెల 9న పెందుర్తి రాగా.. 12న మధ్యాహ్నం సినిమాకు పెందుర్తి థియేటర్‌కు వెళ్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి చరవాణి కూడా పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. ప్రసాదరావు భార్య హేమలత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కె.వి.సతీశ్‌కుమార్ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలు ఏఎస్ఐ డీఎస్ఎన్ రాజుకు అప్పగించారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: ఐదేళ్ల తరువాత గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పెందుర్తి ఎమ్మెల్యే మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలి రోజు 28 పనులకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి 1.69 కోట్లతో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. బంగారమ్మపాలెంలో 9 పనులకు గాను రూ.27.10 లక్షలతో.. ఆరిపాకలో రూ.17.90 లక్షలతో 3 పనులకు, నారపాడులో రూ.9.50 లక్షలతో 2 పనులు, గాలిభీమవరంలో రూ.28.60 లక్షలతో 6 పనులు, టెక్కలిపాలెంలో రూ.28.50 లక్షలతో ఒకపని, వంగలిలో రూ.21.90 లక్షలతో 3 పనులు, అంతకాపల్లిలూ రూ.36 లక్షలతో 4 అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా గ్రామాల్లో శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు దాడి లావణ్య, మామిడి శంకరరావు, గొంప సత్యవమ్మ, ఆకుల శ్రీహేమ, ఎంపీటీసీ సభ్యులు దాడి వెంకట సూర్య ఝాన్సీలక్ష్మీరాణి, సాలాపు మీన, ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దారు చిన్నికృష్ణ, పీఆర్ ఏఈ పి.హరిణి, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బంగారమ్మపాలెంలో అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులు భాగస్వాములు కావాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేసుకోవడంలో పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి సూచించారు. పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇంఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి ఎంపీపీ నాగమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, శిక్షకులు ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, హక్కులపై శిక్షణ ఇచ్చారు. గ్రామాభ్యున్నతిలో వారి పాత్రను వివరించారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామ వార్డు సభ్యులు, ఉప సర్పంచులు తమ విధులు, బాధ్యతలను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. సబ్బవరం మండలంలోని 24 పంచాయతీలకు చెందిన ఇద్దరేసి వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పంచాయతీ పాలనా పరమైన వ్యవహారాలు తెలుసుకోవాలన్నారు. ఎంఆర్‌పీలు కె.శివప్రసాద్, ఈవోఆర్డీ చైతన్య వారికి శిక్షణ ఇస్తూ సమావేశాలు నిర్వహించడం తప్పనిసరిగా చేయాలన్నారు. అభివృద్ధి ప్రణాళికలు ఎలా తయారు చేయాలి, వీధి దీపాల నిర్వహణ, లేఅవుట్ల ఎప్రూవ్ ఏ విధంగా చేయాలి అన్న అంశాల మీద అవగాహన కల్పించారు. సొంత నిధులు సమకూర్చుకోవడం, తాగునీరు తదితరాల గురించి వివరించారు.


ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు సూచనలిస్తున్న అధికారులు

అభివృద్ధికి బాటలు : ఎంపీ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే తన ప్రథమ కర్తవ్యమని.. తద్వారా స్థానిక మహిళలకు, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గొట్టివాడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కంకణం కట్టుకున్నారని తెలిపారు. కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీతో మాట్లాడి రూ.50 వేల కోట్ల రూపాయలు ఐదేళ్లలో తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఆ నిధులను ఉపయోగించి గ్రామాలకు అవసరమైనవి సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రజలంతా క్షేమంగా ఉండాలన్న ఉద్దేశంతో ఎంత మందికైనా మినరల్ వాటర్ ప్లాంట్లు మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. గతంలో ఎద్దేవా చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కళ్లు తెరిచి పవన్‌కల్యాణ్ ఏ విధమైన అభివృద్ధి చేస్తున్నారో చూడాలన్నారు. అంతకుముందు పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 25 వేల కిలోమీటర్ల పొడవునా రోడ్లు వేయాలని నిర్ణయించామన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు.

★ 1326 పంచాయతీల్లో ఒకేసారి నిర్వహించిన సమావేశాల్లో తీర్మానాలు చేయించి వాటిని అమలు చేస్తున్న ఘనత పవన్ కల్యాణ్‌దేనన్నారు. ఒకేసారి పెందుర్తి నియోజకవర్గానికి రూ.25 కోట్లు ఇచ్చారన్నారు. ఇంకా ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచి సాలాపు మీన గొట్టివాడకు ఒక బస్ షెల్టర్ మంజూరు చేయాలని ఎంపీ సీఎం రమేశ్‌ను కోరారు. అనంతరం పలువురు కూటమి నేతలు సీఎం రమేష్, పంచకర్ల రమేష్, గండి బాబ్జీలను గజమాలతో సత్కరించారు. కూటమి నేతలు ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు సాలాపు వెంకటేశ్వరరావు, ఝాన్సీలక్ష్మీరాణి, శరగడం రామారావు, బంతి కోళ్ల పద్మ, శరగడం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కూటమి నేతలు, కార్యకర్తలు, గొట్టివాడ బీఎస్ కల్యాణ మండపంలో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

కేంద్ర బృందం.. పెందుర్తి యూపీహెచ్‌సీ సందర్శన

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం మంగళవారం సందర్శించింది. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి డాక్టర్ జైత్ర, రాష్ట్రీయ బాల సురక్ష పీవో డాక్టర్ సమత, ఎన్‌సీడీ కన్సల్టెంట్ మోహన్, తదితరులు ఆసుపత్రికి వచ్చారు. అక్కడ అందుతున్న సేవలను వైద్యాధికారిణి డాక్టర్ దీపికను అడిగి తెలుసుకున్నారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. ఆసుపత్రి శిథిల భవనంలో కొనసాగడంపై స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.


పెందుర్తి యూపీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం సభ్యులు

పరవాడ ఫార్మాసిటీలో విలువైన పల్లాడియం చోరీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మా సిటీలోని ఒక కంపెనీ నుంచి విలువైన లోహం పల్లాడియం చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫార్మా సంస్థలోని కెటలిస్టు (రసాయన చర్యను వేగవంతం చేయడానికి ఉత్ప్రేరకం)గా వినియోగిస్తారని తెలిసింది. గ్రాము విలువ వేలల్లో ఉంటుంది. ఆ కంపెనీని 40 రోజుల క్రితం నూతన యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. అయితే కంపెనీలో 4 కేజీల పెల్లాడియం చోరీకి గురైనట్లు గుర్తించిన యాజమాన్యం కొద్దిరోజుల క్రితం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే అక్కడికి చేరుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పలువురు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం. కంపెనీలోని కొందరు ఉద్యోగులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పెల్లాడియం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఒకటి, రెండు రోజుల్లో ఈ కేసు కొలిక్కి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఈ కేసును గోప్యంగా ఉంచుతున్నారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి


పెందుర్తి, న్యూస్‌టుడే: రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపులోకి తీసుకురావాలని సీపీఐ నేతలు మంగళవారం పెందుర్తి రైతుబజార్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఐ నాయకులు అత్తిలి విమల, ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ధరల నియంత్రణలో యంత్రాంగం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రాంబాబు, అన్నపూర్ణ, ఆసిరినాయుడు, రమణ, రామారావు, అరుణ, రజిని, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి రైతుబజార్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

పిల్లల్లో అభ్యసన వైకల్యాలను గుర్తించండి

పెందుర్తి, న్యూస్‌టుడే: పిల్లల్లో ఉన్న అభ్యసన వైకల్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలని సహిత విద్య ఉపాధ్యాయులు సూచించారు. డిస్‌లెక్సియా అవగాహన మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం పెందుర్తి దొగ్గవానిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలు పదాలను చదవడం, రాయడం, గుర్తించడంలో వెనుకబడి ఉండటాన్ని డిస్‌లెక్సియా అంటారని సహిత విద్య ఉపాధ్యాయుడు బీఏవీ.నాగేశ్వరరావు తెలిపారు. ఈ వైకల్యాన్ని గుర్తించి పిల్లలను తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో దొగ్గవానిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెందుర్తి దొగ్గవానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

గెడ్డల్లో పూడికతీత పనులు


రవినగర్ గెడ్డలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు

నాయుడుతోట (వేపగుంట), న్యూస్‌టుడే: గెడ్డల్లో చెత్త వేసి వర్షపునీరు పారకుండా అడ్డంకులు సృష్టించవద్దని కాలనీవాసులకు కార్పొరేటరు బల్లశ్రీనువాసరావు సూచించారు. నాయుడుతోట దరి రవినగర్‌లో గెడ్డల్లో పేరుకుపోయిన పూడికలను మంగళవారం ఆయన ప్రజారోగ్యవిభాగం సిబ్బందితో తీయించి శుభ్రం చేయించారు. గెడ్డల్లో వ్యర్థాలు వేయకుండా ఇంటింటికి వచ్చే చెత్తబండికి ఇవ్వాలని కోరారు.

17 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సదస్సులు ఈనెల 17 నుంచి నవంబరు 11 వరకు జరుగుతాయని సబ్బవరం తహసీల్దారు బి.చిన్ని కృష్ణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలపై రైతులు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు పెట్టుకోవాలన్నారు. రీసర్వేభూముల ఎక్టెన్లు, తేడాలు ఉన్న సరిహద్దు తేడాలు ఉన్నా, పేర్లు తప్పులుగా ఉన్న భూయజమానులు అర్జీలు పెట్టుకోవచ్చునన్నారు. గ్రామ సభలు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

★ **షెడ్యూలు ఇలా :** 17న విస్సాక అగ్రహారం, 18 పైడివాడ, 19న అసకపల్లి, 21న ఎరుకునాయుడుపాలెం, 22న చింతగట్లఅగ్రహారం, 23న గొట్టివాడ, 24న గాలిభీమవరం, 25న లగిశెట్టిపాలెం, 26న రాయపుర అగ్రహారం, 28న బంగారమ్మపాలెం, 29న సబ్బవరం, నవంబరు 1న అయ్యన్నపాలెం, 2న బోదువలస, 5న ఎల్లుప్పి, 6న మొగలిపురం, 7న నారపాడు, 8న టెక్కలిపాలెం, 9న ఇరువాడ, 11న పైడివాడ అగ్రహారం గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆయన వివరించారు.

యువతను ప్రోత్సహించేందుకు 'నైపుణ్య పోటీలు'

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సాగర్‌నగర్: యువతలో నైపుణ్యాలు వెలికితీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర మంత్రి జయంత్ చౌధరి పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మూర్తి ప్రయోగశాల, మేకర్స్ స్పేస్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం, జాతీయస్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి నైపుణ్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ వర్సిటీలో బోధనతోపాటు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వై.గౌతమ్‌రావు, వైద్య కళాశాల ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్పీ రావు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నాణ్యమైన భోజనం అందించాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. వార్డు పరిధి దేశపాత్రునిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యతను పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు పాఠశాల ప్రాంగణంలో హైమాస్టు దీపాలను ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– విశ్వం, చోటుమహరాజ్
(వెల్లంకి) – వేట్టయన్ ది హంటర్

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండలంలో బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు కార్యక్రమాన్ని ఖరారు చేశారు. ఈనెల 16న నిడిగట్టు, 17న రామయోగి అగ్రహారం, 18న బోడమెట్టపాలెం, 19న చిప్పాడ, 21న టి.నగరపాలెం, 22న సింగనబంద, 23న అన్నవరం, 24న మూలకుద్దు, 25న అమనాం, 26వ తేదీన మజ్జివలస గ్రామ సచివాలయాల్లో ఈ సదస్సులు జరుగుతాయని తహసీల్దారు పి.రామారావు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: గాయత్రీనగర్ (పీఎంపాలెం) రోడ్డు నంబరు 9లో జీవీఎంసీ పార్కు అధ్వానంగా మారింది. పిచ్చిమొక్కలతో విష పురుగులకు ఆవాసంగా మారింది. – స్థానికులు, గాయత్రీనగర్
సమాధానం: త్వరలో పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. –సింహాచలం, జోన్–2 కమిషనర్

సమస్య: వైఎల్పీ లేఅవుట్(ఎండాడ) ఎస్ఎస్ఎస్ పాఠశాల సమీప జీవీఎంసీ పార్కులోకి పశువులను విడిచిపెట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – బాపూజీ, స్థానికుడు
సమాధానం: పశువులను జీవీఎంసీ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. – కిషోర్, ఆరోగ్య విభాగం అధికారి

ఎండాడ, న్యూస్‌టుడే
సమస్య: శిరుగుడినగర్(ఎండాడ) ఎమ్.కె.ఎరీనా అపార్ట్‌మెంట్ రోడ్డులో ఎక్కడికక్కడ చెట్ల కొమ్మలను నరికి పడేశారు. దీంతో విష పురుగులకు ఆవాసంగా మారింది. – జగదీష్, అపార్ట్‌మెంట్ వాసి
సమాధానం: సిబ్బందిని పంపించి పరిసరాల శుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. – సింహాచలం, జోన్–2 కమిషనర్

బీచ్‌రోడ్డులో ప్రయాణికులకు నిత్యం వెతలే..

సాగర్‌నగర్, న్యూస్‌టుడే

రుషికొండ-సాగర్‌నగర్ మార్గ మధ్య బీచ్‌రోడ్డులోని పలు ముఖ్య కూడళ్లలో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా ప్రదేశాల్లో కొన్నిచోట్ల బస్‌షెల్టర్లు లేక... ఇంకొన్ని ప్రాంతాల్లో షెల్టర్లు నిర్మించినా వసతులు కల్పించక అసౌకర్యానికి గురవుతున్నారు.

గీతం, గాయత్రీ కళాశాలల సమీప బస్ షెల్టర్లను పర్యాటక ప్రాజెక్టు పనుల నెపంతో గత వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ అధికారుల పర్యవేక్షణలో కూల్చివేసిన సంగతి తెలిసిందే. వందలాది ప్రయాణికులు, విద్యార్థులకు ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉండేవి. ప్రస్తుతం లేకపోవడంతో ఇబ్బందికర పరిణామాలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు ఎండలు, వర్షాల సందర్భాల్లో వేచి ఉండడానికి సైతం ఆ షెల్టర్లు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి.

ఫోకస్

ఇక్కడ షెల్టర్లు నిర్మించినా సరే..

సాగర్‌నగర్ వల్లభ గణపతి ఆలయం, ఇస్కాన్ కేంద్రం, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో దాదాపు నాలుగు నెలల క్రితం రూ.లక్షలు వెచ్చించి బస్ షెల్టర్లు నిర్మించినా తగిన వసతులు కల్పించకపోవడం శోచనీయమని స్థానికులు వాపోతున్నారు. ఆయా షెల్టర్లలో కూర్చోడానికి అనువుగా బెంచీలు, బస్సుల రాకపోకలు తెలియజేసే సమాచార బోర్డులు లేకపోవడం తదితర సమస్యలతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రజావసరాలకు అనువుగా సంబంధిత సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు జిల్లా ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరుతున్నారు.


గాయత్రీ కళాశాల సమీపంలో నిలువ నీడ లేక ఇలా...


సాగర్‌నగర్ కూడలిలో సదుపాయాలు లేని బస్‌షెల్టర్


గీతం డీమ్డ్ వర్సిటీ వద్ద గతంలో బస్‌షెల్టర్ తొలగించిన ప్రదేశం

గ్రామాల అభివృద్ధితోనే పురోగతి సాధ్యం: గంటా

పద్మనాభం, న్యూస్‌టుడే: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనంతవరం, పెంట గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంగళవారం భూమి పూజ చేశారు. అనంతవరం-గంధవరం మార్గంలో అలోపాలో గెడ్డ వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు స్థానంలో రూ.30లక్షలతో వంతెన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.15లక్షలతో పెంట గ్రామంలో నిర్మించనున్న సీసీ కాల్వల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడానికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రాజబాబు, సందీప్ పంచకర్ల, కె.రామానాయుడు, కె.రమణ, కె.దామోదరరావు, డి.గోపాలకృష్ణమూర్తిరాజు, కె.లీలావతి, గొర్రెపాటి పెద్ద ఎర్నాయుడు, ఎస్.వెంకటరావు, పెంట సర్పంచి బోధల పావ, కె.నగేష్‌కుమార్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పెంట గ్రామంలో కాల్వల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అ వీ ఇ వీ


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

వైభోగం.. నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవింద రాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ బేడామండపంలోని వెండి సింహాసనంపై ఆశీనులను చేశారు. వేద మంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను వేద మంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

అవగాహన ర్యాలీ

పద్మనాభం, న్యూస్‌టుడే: అభ్యసన వైకల్య మాసోత్సవాన్ని పురస్కరించుకొని పద్మనాభంలోని భవిత కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అభ్యసన వైకల్యం కలిగిన పిల్లలు అక్షరాలు, పదాలు సరిగా పలకలేకపోగా.. చదవడం, అర్థం చేసుకోవడంలోను లోపం కలిగి ఉంటారు. ఇలాంటి వారిని గుర్తించడానికి అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు భవిత కేంద్రం ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ ఫార్మాసిటీలో విలువైన పల్లాడియం చోరీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మా సిటీలోని ఒక కంపెనీ నుంచి విలువైన లోహం పల్లాడియం చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫార్మా సంస్థలోని కెటలిస్టు (రసాయన చర్యను వేగవంతం చేయడానికి ఉత్ప్రేరకం)గా వినియోగిస్తారని తెలిసింది. గ్రాము విలువ వేలల్లో ఉంటుంది. ఆ కంపెనీని 40 రోజుల క్రితం నూతన యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. అయితే కంపెనీలో 4 కేజీల పెల్లాడియం చోరీకి గురైనట్లు గుర్తించిన యాజమాన్యం కొద్దిరోజుల క్రితం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే అక్కడికి చేరుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పలువురు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం. కంపెనీలోని కొందరు ఉద్యోగులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పెల్లాడియం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఒకటి, రెండు రోజుల్లో ఈ కేసు కొలిక్కి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఈ కేసును గోప్యంగా ఉంచుతున్నారు.

కలాం ఆశయ సాధనకు కృషి చేయాలి

కొమ్మాది, న్యూస్‌టుడే: దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను అందరూ ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గంటా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల క్రీడాప్రాంగణాన్ని పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. నాయకులు కోరాడ రాజబాబు, జీవన్‌కుమార్, మన్యాల సోంబాబు, పిల్లా వెంకట్‌రావు, గరే గురునాథ్, లొడగల జానకీరామ్, నాగోతి శివాజీ, షేక్‌బాషా, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సోమయాజులు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ అప్పలరావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోనూ ఈ వేడుకలు పలుచోట్ల నిర్వహించారు. భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రధానాచార్యులు ఎం.జ్యోతికుమారి ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఎస్.సుధాకర్, జి.జి.ఎస్.నాగేశ్వరరావు, ఎం.మహాలక్ష్మి, సి.ఎ.సోమయాజులు, ఆర్.నీలిమ, పి.హరిణి, జి.రవి తదితరులు పాల్గొన్నారు. తెదేపా ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోనూ ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గంటా నూకరాజు, కె.నాగరాజు, ఆర్.రమణ, కె.అప్పన్న, ఎం.సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు


భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాలలో..


భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో..

యువతను ప్రోత్సహించేందుకు 'నైపుణ్య పోటీలు'

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సాగర్‌నగర్: యువతలో నైపుణ్యాలు వెలికితీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మూర్తి ప్రయోగశాల, మేకర్స్ స్పేస్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం, జాతీయస్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి నైపుణ్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ వర్సిటీలో బోధనతోపాటు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వై.గౌతమ్‌రావు, వైద్య కళాశాల ప్రొ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్పీ రావు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

నిత్యావసరాల ధరల పెరుగుదలపై నిరసన

కొమ్మాది, న్యూస్‌టుడే: సామాన్యుడు మోయలేని రీతిలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. జీవీఎంసీ 5వవార్డు శివశక్తినగర్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బ్లాక్ మార్కెట్‌లో నిత్యావసర సరకుల విక్రయాలు నియంత్రించి వీటి ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం.డి.బేగమ్, ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎస్.కె.సల్మా, బి.కేశవయ్య, రవి, వేంకటేశ్వరరావు, ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కొండలపైనా కన్నేశారు..

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలంలోని పలు కొండలపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. కొద్ది రోజులుగా యంత్రాలతో చదును పనులు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జట్లమ్మ కొండ చుట్టూ కొండపై పోలీసుశాఖ టవర్ కోసమంటూ 5 నెలల కిందట రోడ్డు వేశారు. తాజాగా కొండ చుట్టూ ఆ శాఖకు సంబంధం లేని రహదారి చదును పనులు జరగడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.★ ఆనందపురం-పెందుర్తి రహదారికి ఆనుకుని ఉన్న గండిగుండం కొండపైనా యంత్రాల సాయంతో చదును చేస్తున్నారు. ఈ పనులకు ఎలాంటి అనుమతులు లేవని ఫిర్యాదు చేసినా యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.★ గిడిజాల కొండపై కూడా సరిహద్దులు నిర్ణయించి రహదారి చదును పనులు జరుగుతున్నాయి.★ తంగుడుబిల్లి కొండపై యంత్రాల సాయంతో చదును చేసి దర్జాగా మొక్కలు నాటారు. ఈ విషయమై ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


జట్లమ్మ కొండపై యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం


గండిగుండం కొండపై..

పొంచి ఉన్న ప్రమాదం

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధిలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్తు ఫ్యూజ్ బాక్సులకు కనీస రక్షణ ఏర్పాట్లు లేవు. ఇవి రద్దీ ప్రదేశాల్లో, విద్యాలయాలు, బస్‌స్టాప్‌ల వద్ద ఉండడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొల్లల ఎండాడ ప్రధాన దారిలోని వెంకన్న ఆలయం బస్‌స్టాప్ వద్ద ఉన్న ఫ్యూజ్ బాక్సుకు తలుపులు ఊడిపోవడంతో తీగలు బయటకొచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అదే ప్రాంతంలోని వైఎల్పీ లేఅవుట్‌కు వెళ్లే దారిలోని పలు విద్యుత్ బాక్స్‌లకు కూడా సరైన రక్షణ ఏర్పాట్లు లేక ఆ ప్రాంతీయులు సైతం భయపడుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి వీటికి తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.


గొల్లల ఎండాడ బస్‌స్టాప్ వద్ద ఇలా..

పీహెచ్‌సీలో కేంద్ర బృందం తనిఖీలు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర వైద్యాధికారుల బృందం మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో గుర్తించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు కేంద్ర బృందం అధికారి డాక్టర్ జైత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులను గుర్తించే తీరు, రోగులకు అందించే వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. లొడగలవానిపాలెం, వేములవలస ప్రాంతాలకు చెందిన పలువురు రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో రోజువారీ ఓపీ, మందుల పంపిణీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు తదితరాలకు సంబంధించి దస్త్రాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత, జిల్లా హెచ్‌డబ్ల్యూసీ నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ, పీహెచ్‌సీ వైద్యులు గంగునాయుడు, షహనాజ్ సాధియ తదితరులు పాల్గొన్నారు.


ఆనందపురం పీహెచ్‌సీలో వివిధ అంశాలపై ఆరా తీస్తున్న అధికారులు


తెప్పోత్సవానికి కోనేరు రూపు మారేనా..!

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభంలోని కన్నయ్య కోనేరు అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితమైంది. ఏటా స్వామివారి కల్యాణోత్సవాల అనంతరం ఈ కోనేరులో తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. వివిధ కారణాల వల్ల ఎప్పుడో నిలిచిపోయిన ఆ వేడుకను రెండేళ్ల క్రితం పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో కోనేరును సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసి మొక్కలు నాటి పార్కు మాదిరిగా అభివృద్ధి చేయడానికి అప్పటి పాలకులు, ఆలయ అధికారులు ప్రతిపాదించినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత అధికారులు స్పందించి దాతల సహకారంతోనైనా కోనేరు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పద్మనాభుడి భక్తులు కోరుతున్నారు.


పద్మనాభంలోని కన్నయ్య కోనేరు పరిస్థితి

గోతుల మార్గంలో రాకపోకలెలా..

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డు గోతులమయంగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత గ్రామంలో సర్వ రోగాలకు ఉచితంగా సేవలందించే కొంగర రమేష్ ఆయుర్వేద వైద్యశాలకు నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వారంతా ఇదే మార్గంలో ప్రయాణించాల్సి ఉండడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షం పడితే గోతుల్లో నీరు నిలిచిపోయి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు ఈ రహదారి ప్రాధాన్యాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో వీధిదీపాలు వెలగక చీకటి పడితే రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.


తర్లువాడ రహదారి దుస్థితి

జిమ్నాస్టిక్స్‌లో బాలుడి ప్రతిభ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వవార్డు రేవళ్లపాలెంకు చెందిన పిల్లా లక్ష్మీనారాయణ రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో విశాఖ జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ఈ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ బాలుడు పాల్గొంటాడని శిక్షకుడు షేక్ మున్వర్ తెలిపారు.


లక్ష్మీనారాయణ

స్వచ్ఛతకు దూరం.. పరిసరాలు అధ్వానం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ప్రాంగణం, పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. ప్రహరీ బయట ప్రదేశం వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. స్టేషన్ ముందు ఖాళీ స్థలంలో వాహనాలు పెట్టేందుకు సైతం ఖాళీ లేకుండా రెండు వైపులా బడ్డీలు ఏర్పాటు చేశారు. మరోవైపు స్టేషన్ ఆవరణలో ద్విచక్రవాహనాల పార్కింగ్‌తో నిండిపోతోంది. ఈ కారణంగా స్టేషన్‌కు ఎవరైనా వస్తే నిలబడేందుకు కూడా స్థలం లేని పరిస్థితి. పరిసరాల అపరిశుభ్రత కారణంగా దుర్వాసన, దోమల బెడద వెంటాడుతోంది. స్వచ్ఛతకు అర్థం చెప్పాల్సిన పోలీసు అధికారులే స్టేషన్ పరిసరాలపై దృష్టి సారించకపోవడం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు.


పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పక్కనే ఇలా..


స్టేషన్ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్

ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వద్దే అనధికార పార్కింగ్

పట్టించుకోని అధికారులు.. తప్పని ఇక్కట్లు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్లపై లారీల పార్కింగ్ కారణంగా కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సంచరించే రోడ్లపై ఇష్టానుసారం పదుల సంఖ్యలో లారీలు పార్కింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవ్వడమే కాక రాత్రి వేళ వీటిని గమనించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి రాకపోకల కారణంగా రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. అలాగే ఆంజనేయస్వామి ఆలయం పక్కన వీటిని నిలపడం వల్ల భక్తులు కూడా అవస్థలు పడుతున్నారు. సేవా మార్గంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పక్కనే ఈ విధంగా లారీలు పార్కింగ్ చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


స్టేడియం వద్ద రోడ్డుపై ఇలా..


ఆంజనేయస్వామి ఆలయం పక్కన..

అల్లుకున్న నిర్లక్ష్యం..

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు పరిధి వైఎల్పీ లేఅవుట్, సన్ కళాశాల ప్రధాన మార్గంలోని విద్యుత్ స్తంభాలకు పాదులు అల్లుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వైఎల్పీ లేఅవుట్ (ఎండాడ) దారిలో ఇలా..

విశాఖ తూర్పు

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్‌లో రాణింపు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో గాయత్రి విద్యాపరిషత్ ఎం.ఎల్.బి.టి. పాఠశాలకు చెందిన ఎం.అబ్బాస్ బంగారు పతకం సాధించింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అబ్బాస్ టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ క్లబ్‌లో తర్ఫీదు పొంది, కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకాన్ని సాధించి సత్తా చాటింది. అబ్బాస్‌ను జీవీపీ సంయుక్త కార్యదర్శి డి.వి.ఎస్.కామేశ్వరరావు, ప్రిన్సిపల్ కె.మధురవాణిలు అభినందించారు.

ఘనంగా కాళీమాత ఉత్సవాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పదో వార్డు పరిధిలోని ఆదర్శనగర్‌లో ఒడిశా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పూజలు నిర్వహించి ఆఖరి రోజు అమ్మవారి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకుని వెళ్లి సాగర్‌నగర్ తీరంలో నిమజ్జనం నిర్వహించారు.



పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

మేమున్నాం.. మీకు తోడుగా

10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-12లో డోర్ నెంబరు 1-116-15 ఎదురుగా వ్యర్థాలు తొలగించటం లేదు – రమేష్‌బాబు

సమాధానం : సిబ్బందిని నియమించి వ్యర్థాలను తరలిస్తాం – సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్

సమస్య : ఎంవీపీ సెక్టారు-8లోని 74/ఎ/3/6 పోల్‌పై వీధి దీపాలు వెలగటం లేదు – శ్రీనివాస్

సమాధానం : సిబ్బందిని నియమించి మరమ్మతులు చేపడతాం – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

చదువులో రాణిస్తూ.. నృత్యంలో మెప్పిస్తూ..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : పీఠాపురం కాలనీలోని ఆడిటోరియంలో నిత్యం ఏదో ఒక నృత్య, సంగీత కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపుతున్న వారిలో చాలామంది విద్యార్థినులు ఉంటున్నారు. వీరంతా ఒకవైపు చదువులో రాణిస్తూనే మరోవైపు తమకిష్టమైన నాట్యం, సంగీతంలోనూ ప్రతిభ చూపి పలువురి ప్రశంసలందుకుంటున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.





నాట్యం ప్రాణంగా భావిస్తాను

చిన్నతనం నుంచి నాట్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చాను. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతున్నాను. నాట్యం నేర్చుకోవడం వలన చదువు కూడా ఎలాంటి ఇబ్బందులు లేవు. పరీక్షల సమయంలో కాస్త తక్కువ ప్రదర్శనలు ఇచ్చినా మిగతా సమయంలో ఏ సమస్య లేదు.

– ఎ.గీతిక, ఇంటర్



కూచిపూడి నృత్యాన్ని విడిచిపెట్టను

నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. భవిష్యత్తులో ఎక్కడ ఉన్నా కూచిపూడి నృత్యాన్ని విడిచిపెట్టను. దేశ, రాష్ట్రస్థాయిలో కూచిపూడి రంగంలో పేరు ప్రతిష్ఠలు సాధించడానికి కృషిచేస్తాను. కళారంగంలో ఎంత ఎక్కువ నేర్చుకున్నా అదేస్థాయిలో చదువులో కూడా ముందంజలో నిలుస్తాను.

– జి.భావనప్రీతి, తొమ్మిదో తరగతి



కళలను బతికించుకోవడం మన బాధ్యత

భారతీయ సంప్రదాయ కళలను పరిరక్షించుకోవడం మన బాధ్యత. కూచిపూడి నృత్యరూపకాలు భారతీయ సంస్కృతి. కూచిపూడి నృత్యం అంటే సత్యభామ. కళారంగంలో రాణిస్తాను. ఉన్నత శిఖరాల్లో నిలుస్తాను. చదువుతూ కళారంగంలో రాణిస్తాను.

– సి.హెచ్.షారిని



డిగ్రీ చదువుతూ..

నా పేరు కె.మంజుశ్రీ ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. ఐదో ఏట నుంచి కళారంగంలో రాణిస్తున్నాను. నగరంలో పలు చోట్ల కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. చదువుకు, కళారంగానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా ముందుకు సాగుతున్నాను. భవిష్యత్తులో నాట్యరంగంలో స్థిరపడతాను.

– కె.మంజుశ్రీ, డిగ్రీ విద్యార్థిని



గత ఏడు సంవత్సరాలుగా..

ప్రస్తుతం పదోతరగతి చదువుతున్నాను. గత ఏడు సంవత్సరాలుగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్నా. కళారంగంలో ఉండటం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. చదువుకు, కళలకు ఎటువంటి ఇబ్బంది ఉండటం లేదు. భవిష్యత్తులో కూచిపూడి ఉపాధ్యాయురాలిగా స్థిరపడతాను. నాట్యం అంటే చాలా ఇష్టంగా భావిస్తాను.

– ఆర్.హేనిఅక్షయ, పదో తరగతి



చదువుకు ఆటంకం కాలేదు..

గత రెండున్నర సంవత్సరాల నుంచి కూచిపూడి నాట్యరంగంలోకి ప్రవేశించాను. ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తిచేశాను. ఎప్పుడు కూడా నృత్యం చదువుకు అడ్డుపడలేదు. మనిషికి ఏకాగ్రతగా అనిపించింది. ఉన్నత చదువులు చదువుతూ కూచిపూడి నృత్యంలో ప్రదర్శనలు చేసి ఆకట్టుకునేలా ప్రయత్నం చేస్తాను.

– వి.ఎస్.ఎస్.స్నేహితయామిని, బీటెక్

యువతను ప్రోత్సహించేందుకు 'నైపుణ్య పోటీలు'

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సాగర్‌నగర్: యువతలో నైపుణ్యాలు వెలికితీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర మంత్రి జయంత్ చౌధరి పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మూర్తి ప్రయోగశాల, మేకర్స్ స్పేస్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం, జాతీయస్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి నైపుణ్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ వర్సిటీలో బోధనతోపాటు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వై.గౌతమ్‌రావు, వైద్య కళాశాల ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్పీ రావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

వృత్తి విద్యలో శిక్షణ

ఆరిలోవ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణాపురంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు దసరా సెలవుల్లో ఆరోగ్యం-అందం అంశంలో శిక్షణ ఇచ్చారు. సర్వ శిక్ష అభియాన్ ఆదేశాల మేరకు ఒకేషనల్ ఉపాధ్యాయురాలు ఎస్.ద్రాక్షాయణి అధ్వర్యంలో విద్యార్థులకు గాజువాకలో బ్యూటిఫికేషన్‌లో శిక్షణ ఇచ్చారు. విశాఖ ఉమ్మడి జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త ఎస్.రూపవతి ఆదేశాల మేరకు దసరా సెలవుల్లో విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణకు పంపామని బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వి.రత్నవల్లి తెలిపారు.



ముఖ సౌందర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఆచార్య సరస్వతి విద్యార్థిని అభినందించిన వీసీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగం ఆచార్యులు కె.సరస్వతి విద్యార్థిని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల విశాఖ మ్యూజిక్ అకాడమి డాక్టర్ సరస్వతి విద్యార్థిని నేదూనూరి కృష్ణమూర్తి ఎండోమెంట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య సరస్వతి విద్యార్థిని వీసీ తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుకు తనకు అందిన అవార్డును చూపుతున్న సరస్వతి విద్యార్థి

గద్దర్ గొప్ప చరిత్రకారుడు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్ గొప్ప చరిత్రకారుడు అని ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. తన కార్యాలయంలో గద్దర్ సభ గోడపత్రికను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. విశ్రాంత ఆచార్యులు కె.జాన్ మాట్లాడుతూ.. ఈనెల 20న విశాఖ పౌరగ్రంథాలయంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటలవరకు గద్దర్ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య ప్రేమానందం, ఆచార్య జర్రా అప్పారావు, ప్రజా గాయకులు మజ్జి దేవిశ్రీ, ఆరేటి మహేష్, డాక్టర్ టి.షారోన్‌రాజు, ఆవాల రమేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ-సీ ఎంప్లాయీస్ (టీచర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

ఎం.వి.పి.కాలనీ, పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జీవీపీ యాజమాన్య ప్రతినిధి ఆచార్య డి.దక్షిణామూర్తి అన్నారు. ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని గాయత్రీ విద్యాపరిషత్ ఎం.ఎల్.బి.టి. స్కూలు విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్ కలామ్ స్ఫూర్తిని చాటాలని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



మొక్కలతో విద్యార్థులు

వరద బాధితులకు సహాయం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులు పడ్డ రాష్ట్ర ప్రజలకు తమవంతు సహాయంగా గాజువాకలోని చైతన్య మహిళా కళాశాల రూ.లక్ష విరాళాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అందించారు. ఈ విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని వారు కోరారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో చైతన్య మహిళా కళాశాల అధ్యాపకులు

ఘనంగా కలాం జయంతి వేడుకలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో మంగళవారం ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భాజపా మైనార్టీ మోర్చా అధ్యక్షులు షేక్ నూర్‌బాషా, మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతా మోహన్‌రావు పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ ఎండీ గౌస్, సి.హెచ్.రాజబాబు, సీనియర్ నాయకులు ప్రకాష్‌రెడ్డి, విజయానందరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా మైనార్టీ నాయకులు

కళావిహీనంగా...





జి.20 చిహ్నంలోనుంచి పడిపోయిన ఓ అంకె..

నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జి-20 సదస్సులో భాగంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చిహ్నాలు ప్రస్తుతం కళావిహీనంగా మారాయి. చిహ్నాల వద్ద పచ్చదనం పెంపొందించారు. తర్వాతి కాలంలో వీటిని విస్మరించటంతో పచ్చదనం కరవైంది. ఇప్పటికైనా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకమైన జి-20 చిహ్నాల నిర్వహణను పట్టించుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పోటీ పరీక్షల్లో రాణించాలంటే అన్ని అంశాల్లోను నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు మహ్మద్ అబ్దుల్లా అన్నారు. మంగళవారం సమతా కళాశాలలో పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం వివిధ రకాల పోటీ పరీక్షలు జరుగుతున్న తరుణంలో అందుకు విద్యార్థులు సంసిద్ధం కావాలన్నారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల డీన్ ఆచార్య విజయారవీంద్ర, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహ్మద్ అబ్దుల్లా

నిబంధనలు ఉల్లంఘించిన వారి డ్రైవింగ్ లైసెన్సు రద్దుకు వినతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 182 మందిపై ఆర్టీవోకు ఫిర్యాదు చేసినట్లు తూర్పు జోన్ ట్రాఫిక్ సి.ఐ. అమ్మినాయుడు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిపిన వాహన తనిఖీల్లో హెల్మెట్ లేని వారికి జరిమానాలతో పాటు లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనదారుల రక్షణలో భాగంగా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు.



సిరిపురం కూడలి వద్ద తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది



దెబ్బతిన్న కారు ముందు భాగం

తప్పిన ప్రమాదం..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆరిలోవ కాలనీ శ్రీకాంత్ నగర్ చివరిభాగంలో ఓ కారు అతివేగంతో వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ కాలనీ నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వైపు ఇద్దరు యువకులు కారులో వెళ్తున్నారు. ముత్యాలమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి బ్రేకులు పడకపోవటంతో ఎడమవైపు తిప్పారు. అది డివైడర్‌ను ఢీకొని బోల్తాపడి ఆగిపోయింది. కారు ముందుభాగం బాగా దెబ్బతింది. వెంటనే స్థానికులు కారులో ఉన్న యువకుల్ని బయటకు తీశారు. అందులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని కారును వేరే వాహనంలో షెడ్‌కు తరలించారు.

ఐ.ఎ.ఆర్.ఎస్.ఎ.కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియన్ అమెచ్యూర్ రోలర్ స్కేటింగ్ అకాడమీకి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కింది. ఐ.ఎ.ఆర్.ఎస్.ఎ.కు చెందిన 60 మంది స్కేటింగ్ క్రీడాకారులు వివిధరకాల పోటీల్లో పాల్గొని 35 బంగారు పతకాలు, 38 రజత పతకాలు, 22 కాంస్య పతకాలను గెలుచుకుని 311 పాయింట్లతో ప్రథమస్థానంలో నిలిచారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ఎస్.వి.రాజా మెమోరియల్ ట్రోఫీని కార్యదర్శి శీలం లక్ష్మణ్, కోచ్ సింహాద్రి, మనోహర్‌లకు అందజేశారు.



ఓవరాల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీ అందుకుంటున్న సింహాద్రి తదితరులు

వివాహితను కాపాడిన పోలీసులు

ఎం.వి.పి.కాలనీ: కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను నగర పోలీసులు కాపాడారు. ఒక వివాహిత తన భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవటానికి ఆర్కేబీచ్‌కు వచ్చింది. బీచ్ తీరంలో ప్రమాదకరంగా ఉండే ప్రాంతానికి వెళ్తుండగా, అక్కడే విధుల్లో ఉన్న బీచ్ మొబైల్ సిబ్బంది, లైఫ్‌గార్డులు గమనించి ఆమెను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళను కాపాడిన పోలీసు సిబ్బందిని సి.పి. శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్: లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీ షెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విశాఖ (22870) ఎక్స్‌ప్రెస్ ఈనెల 15న ఉదయం 10 గంటలకు బదులు 2.30 గంటలు ఆలస్యంగా 12.30 గంటలకు.., నాందేడ్-సంబల్‌పూర్ (20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.30 గంటలకు బదులు 2.30 గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటలకు.., హావ్‌డా-ఎస్ఎంవీటీ బెంగళూరు(12863) సూ.ఫా. ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.50 గంటలకు బదులు 3.10గంటలు ఆలస్యంగా అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటలకు.., విశాఖ-కోర్బా(18518) ఎక్స్‌ప్రెస్ రాత్రి 9.50 గంటలకు బదులు 1.15గంటలు ఆలస్యంగా రాత్రి 10.20 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

తీరం వ్యర్థాలమయం





తీరంలో విగ్రహాల వ్యర్థాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : విశాఖ తీరం వ్యర్థాలతో నిండిపోయింది. దసరా పండగ ముగిశాక దుర్గామాత విగ్రహాలు నిమజ్జనం చేయగా.. ఆ విగ్రహాలకు వాడిన వస్తువులు తీరానికి కొట్టుకువస్తున్నాయి. దీంతో పాటు మురుగు కాలువల వల్ల చేరుతున్న వ్యర్థాలు కూడా తీరానికి కొట్టుకువస్తున్నాయి. పెదజాలారిపేట ఆర్టీసీ డిపో వెనుకాల గల తీరం ఈ వ్యర్థాలతో నిండిపోయింది.



తీరంలో పేరుకుపోయిన చెత్త



వంతెన శిథిలం..

ఆరిలోవ, న్యూస్‌టుడే : పదకొండో వార్డు పరిధి బాలాజీనగర్ ప్రాథమిక ఆసుపత్రి సమీపంలో గెడ్డ మీద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఇరువైపుల రెయిలింగ్ విరిగిపోయి ఉంది. ఈ వంతెన 1996లో అప్పటి అవసరాలకు తగ్గట్టుగా నిర్మించారు. బాలాజీనగర్, గాంధీనగర్‌ల మధ్య కాలువ మీద ఉన్న పురాతన వంతెన మీద ట్రాఫిక్ రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. గాంధీనగర్ నుంచి ఆరిలోవ వైపు వెళ్లేందుకు ఈ వంతెన ఒకటే ఆధారం. 11, 12 వార్డులను కలిపే ముఖ్యమైన వంతెన ఇది. వెడల్పు తక్కువ. చిన్న వ్యాన్లు, కార్లు, ఆటోలు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. ఇప్పటి అవసరాలకు తగ్గట్టుగా వంతెన వెడల్పు పెంచి పునర్నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరవాడ ఫార్మాసిటీలో విలువైన పల్లాడియం చోరీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మా సిటీలోని ఒక కంపెనీ నుంచి విలువైన లోహం పల్లాడియం చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫార్మా సంస్థలోని కెటలిస్టు (రసాయన చర్యను వేగవంతం చేయడానికి ఉత్ప్రేరకం)గా వినియోగిస్తారని తెలిసింది. గ్రాము విలువ వేలల్లో ఉంటుంది. ఆ కంపెనీని 40 రోజుల క్రితం నూతన యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. అయితే కంపెనీలో 4 కేజీల పెల్లాడియం చోరీకి గురైనట్లు గుర్తించిన యాజమాన్యం కొద్దిరోజుల క్రితం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే అక్కడికి చేరుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పలువురు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం. కంపెనీలోని కొందరు ఉద్యోగులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పెల్లాడియం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఒకటి, రెండు రోజుల్లో ఈ కేసు కొలిక్కి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఈ కేసును గోప్యంగా ఉంచుతున్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం



17న ఎరుకుమాంబ ఆలయ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తిలోని శాఖ ఎరుకుమాంబ అమ్మవారి వార్షిక వేడుకల్ని 17వ తేదీ గురువారంనాడు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయం ఎగ్జిక్యూటివ్ అధికారిణి జి.వి.రమాబాయి తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన కార్యక్రమం జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

← అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

లేఖన, పఠన, ఏకాగ్రత వైకల్యంపై అవగాహన ర్యాలీ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్‌కాలనీలోని జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో లేఖన, పఠన, ఏకాగ్రత లోపం, గణిత పరమైన వైకల్యం కలిగిన పిల్లలకు అవగాహన కల్పించే దిశగా ర్యాలీ చేపట్టారు. మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఎం.ఇ.ఒ.లు రామారావు, బాలమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైన వైకల్యం కలిగిన పిల్లలను కూడా మామూలు విద్యార్థులతో కలిపి పాఠ్యాంశాలు బోధించవచ్చని తెలిపారు. ఇటువంటి పిల్లల్ని గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ఫ్లెక్సీ, ప్లకార్డులు చేతబట్టి పురవీధుల్లో నినాదాలు ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు జగదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎం.ఇ.ఒ.లు రామారావు, బాలమణి, ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస తదితరులు

వీధుల్లో అంధకారం

వెలగని వీధి దీపాలు

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14, 24వ వార్డుల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు ఆగుతాయో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. సీతమ్మధార, గాంధీనగర్, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక వీధుల్లో అంధకారం అలముకుంటోంది. చీకటి పడితే చాలు స్థానికులు బయటకు రావడానికి సంకోచించాల్సి వస్తోంది. ఓ చోట దీపాలు వెలగక, మరో చోట వెలిగినా కాంతి పడక, ఇంకో ప్రాంతంలో అసలు దీపాలు ఉన్నాయో లేదా అనుమానం తలెత్తుతోంది. ఒకరోజు వెలిగితే పది రోజులు వెలగడం లేదని.. చీకటితో దొంగతనాల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. సమస్యపై ఫిర్యాదులు చేసి విసిగిపోవడం తప్ప పరిష్కారానికి నోచుకోలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.


ఎన్‌ఎంసీహెచ్ పాఠశాల రహదారి


శివాలయం ఎదురు సందులో...


ఎస్సీ వసతిగృహం వీధిలో..


రోడ్డుపై మురుగునీరు పారుతున్న దృశ్యం (నిన్నటి చిత్రం)

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

స్పందనకు వందనం

డ్రైనేజీని శుభ్రం చేశారు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తి శ్రీసూర్యా కూడలిలోని రహదారుల పక్కనున్న డ్రైనేజీల్లో చెత్త చెదారాలు పేరుకుపోవడంతో అందులో మురుగు నీరు సజావుగా పారకుండా రహదారులపై పొంగి పొర్లుతోంది. గత రెండు రోజులుగా ఆ నాలుగురోడ్ల కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డుకు వెళ్లే దారిలో సూపర్ మార్కెట్ వద్ద పరిస్థితి ఇది అని చెబుతూ ఈనాడు దినపత్రిక ఉత్తరం పేజీలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత 27వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ వెంటనే తన సిబ్బందితో డ్రైనేజీని శుభ్రం చేయించి అక్కడ నెలకొన్న సమస్యను పరిష్కరించారు.


డ్రైనేజీలో దిగి శుభ్రం చేస్తున్న శానిటరీ సిబ్బంది

కంచరపాలెంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

కంచరపాలెం, న్యూస్‌టుడే: కంచరపాలెంలో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇందుకు రైతుబజారు ఆనుకుని మీసేవా కేంద్రం వద్ద ఖాళీ స్థలం సైతం ఉందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తే రైతుబజారుకు కూరగాయలు తీసుకొచ్చే రైతులు, పేదలు ఎంతో మందికి అన్నాన్ని అందించేవారవుతారన్నారు. అయిదు వార్డుల ప్రజలకు అనువైన బజారు కావడంతో నిత్యం వందలాది మంది పేదలు, కూలీలు బజారుకొస్తారని తద్వారా ఇక్కడ క్యాంటీన్ వారికి ఎంతో ఉపయోగపడుతుందని ఈ ప్రాంత వాసులు తెలిపారు.


మీసేవా కేంద్రం వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలం

వేడుకగా ఉత్సవాలు

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-9 తెన్నేటినగర్‌లో శ్రీ పెద్దమ్మతల్లి యూత్‌కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి ఉత్సవాలు విజయదశమి నుండి ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు అమ్మవారికి కుంకుమపూజలు, హోమం నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం కాలనీవాసులకు అన్న సమారాధన, సాయంత్రం దూపదీపాలతో దీపారాధన నిర్వహించారు.


కొలువుదీరిన దుర్గామాత

డల్లాస్‌లో ఘనంగా నవరాత్రి మహోత్సవం

మురళీనగర్, న్యూస్‌టుడే : విదేశాల్లో నివాసం ఉంటున్న ప్రవాసాంధ్రులు ప్రతి ఏటా మన సంప్రదాయ పండుగలతో అలరారుతూ బంధుమిత్రులను ఆహ్వానించి దసరా వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ కోవలోనే అమెరికా డల్లాస్‌లో నివాసం ఉంటున్న మురళీనగర్‌కు చెందిన ఓం వార్కెట్ అధ్యక్షులు వి.ప్రమీల కుమార్తె నమ్రత 10రోజుల పాటు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు దుర్గాదేవి భక్తిపాటలు, పిల్లలతో అమ్మవారికి ఇష్టమైన శాస్త్రీయసంగీతం వినిపిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏర్పాటు చేసిన అష్టలక్ష్ములు, నవదుర్గలు, దశావతారాలు, శ్రీరంగనాథుడు, పద్మనాభస్వామి తదితర బొమ్మలతో ప్రత్యేకంగా అలంకరించిన బొమ్మలకొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. సంగీతంలో శిక్షణ పొందిన రితిక్ష, అక్షర, వైష్ణవి, శిరీష సహకారంతో ఈ పండుగను వేడుకగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.


సంగీతాలాపనలో పాల్గొన్న యువతులు

పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటాం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను పి.పి.పి. పద్ధతితో ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ ఆల్ ఇండియా ఫెడరేషన్ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా మంగళవారం ఆయన దీక్షలో పాల్గొన్నారు. విశాఖ పోర్టును నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేసేందుకు పోర్టు యాజమాన్యం కుట్ర పన్నిందని ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని బి.జగన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, కె.ఎస్.కుమార్, జె.సత్యనారాయణ, శంకరరావు, నాయుడు పాల్గొన్నారు.


సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద దీక్ష చేస్తున్న నాయకులు

దేవస్థానం భూముల సమస్యపై ఎమ్మెల్యే గంటాకు వినతి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: నలభై అయిదో వార్డు సింహగిరి కాలనీ, సత్యసాయినగర్, గణేష్ నగర్, వరహాగిరి కాలనీల్లో సింహాచలం దేవస్థానం భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ప్రజల ఇబ్బందుల్ని భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు జనసేన ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, వార్డు జనసేన నాయకులు తుమ్మల త్రినాథరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి సింహాచలం దేవస్థానం భూముల్లో నివాసం ఉంటున్న సామాన్య, మధ్య తరగతి వారి ఇబ్బందులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి వివరించారు. నలభై ఏళ్ళ నుంచి నివాసం ఉండడం వల్ల వారి బిడ్డలతో పాటు మనవళ్లు, మనవరాళ్లుతో కుటుంబాలు పెరిగాయని, అయితే ఇక్కడ నిర్మించిన ఇళ్లు మాత్రం సరిపోవడం లేదన్నారు. ఎవరైన అదనపు అంతస్తులు నిర్మించుకున్నా, మరమ్మతులు చేపట్టినా దేవస్థానం అధికారులు అంగీకరించడం లేదని, దీంతో ఇక్కడున్న ఆ చిన్న ఇళ్ళల్లోనే అందరు ఉంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల త్రినాథరావు ఎమ్మెల్యేకు ఒక వినతి పత్రం అందజేశారు. తన నియోజకవర్గ సమస్య కావడంతో దీనిపై దేవస్థానం అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గంటా వీరికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గొంటు మోహనరావు, తెదేపా వార్డు అధ్యక్షుడు రాజు మాధవ్, చింతల వెంకటరమణ, బండి రాజు, పీల హరిప్రసాద్, గోవింద్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గంటాతో సమావేశమైన ఉషాకిరణ్, త్రినాథరావు

అ·వీ·ఇ·వీ

ఫార్మాసిటీలో విలువైన పల్లాడియం చోరీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మా సిటీలోని ఒక కంపెనీ నుంచి విలువైన లోహం పల్లాడియం చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫార్మా సంస్థలోని కెటలిస్ట్ (రసాయన చర్యను వేగవంతం చేయడానికి ఉత్ప్రేరకం)గా వినియోగిస్తారని తెలిసింది. గ్రాము విలువ వేలల్లో ఉంటుంది. ఆ కంపెనీని 40 రోజుల క్రితం నూతన యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. అయితే కంపెనీలో 4 కేజీల పెల్లాడియం చోరీకి గురైనట్లు గుర్తించిన యాజమాన్యం కొద్దిరోజుల క్రితం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే అక్కడికి చేరుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పలువురు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం. కంపెనీలో కొందరు ఉద్యోగులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పెల్లాడియం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఒకటి, రెండు రోజుల్లో ఈ కేసు కొలిక్కి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఈ కేసును గోప్యంగా ఉంచుతున్నారు.

దివ్యాంగ చిన్నారులకు వితరణ

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 51వ వార్డులో ఉన్న దివ్యాంగుల ఆశ్రమం కేర్ అండ్ లవ్‌లో చిన్నారులకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేయడానికి, నెల రోజులపాటు నిత్యావసర వస్తువులకు సంబంధించి రూ.25 వేల విరాళాన్ని సత్వాస్య ఫౌండేషన్ అందజేసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి ప్రణవానంద సరస్వతి మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను చేపట్టి, చిన్నారులకు, పేదలకు అండగా ఉంటామని ఆయన తెలియజేశారు.



కేర్ అండ్ లవ్ ఆశ్రమానికి చెక్కు అందజేస్తున్న స్వామి ప్రణవానంద సరస్వతి

చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన

మురళీనగర్, న్యూస్‌టుడే : జీవీఎంసీ ఉన్నత పాఠశాల మాధవధారలో మంగళవారం అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. మ్యాజిక్‌బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.హేమలత సబ్బుతో చేతులు కడుక్కోవడం, వాటి ప్రాముఖ్యత పట్ల అవగాహన కల్పించారు. ప్రతిరోజు తినేముందు చేతులు పరిశుభ్రంగా కడిగి భుజించాలని, మలవిసర్జన అనంతరం సబ్బుతో చేతులు కడుక్కోవాలని సూచించారు. మ్యాజిక్ బస్ పర్యవేక్షకులు ఆర్.శంకరరావు, డి.సాయిరాం, దుర్గాభవానీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మెలకువలు నేర్పిస్తున్న నిర్వాహకులు


పరిశుభ్రతలో మేముసైతం అంటున్న విద్యార్థులు

యువతను ప్రోత్సహించేందుకు 'నైపుణ్య పోటీలు'

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సాగర్‌నగర్: యువతలో నైపుణ్యాలు వెలికితీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మూర్తి ప్రయోగశాల, మేకర్స్ స్పేస్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం, జాతీయస్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి నైపుణ్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ వర్సిటీలో బోధనతోపాటు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వై.గౌతమ్‌రావు, వైద్య కళాశాల ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్పీ రావు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన 220 మంది వైద్య విద్యార్థుల (మెడికోలు) పరిచయ కార్యక్రమం సోమవారం సాయంత్రం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఉప ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్, ఫిజియాలజీ సహ ప్రొఫెసరు డాక్టర్ పి.ఎస్.ఎన్.రాజు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రకిషోర్, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ భవాని, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మగీతాంజలి తదితరులు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సదుపాయాలు, ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలు, వైద్య విద్య ప్రాధాన్యత, ఎన్‌ఎంసీ నిబంధనలు తదితర అంశాలను వివరించారు. క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.


మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్, చిత్రంలో డాక్టర్ బుచ్చిరాజు తదితరులు


కార్యక్రమానికి హాజరైన వైద్య విద్యార్థులు

17 నుంచి పీజీ కోర్సుల్లో స్పాట్ ప్రవేశాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో స్పాట్ ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ ఆర్.మంజుల తెలిపారు. ఎమ్మెస్సీ భౌతికశాస్త్రం, గణితం, రసాయన శాస్త్రం, మైక్రోబయాలజీ, వృక్షశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, ఎంకాం, ఎంఏ కోర్సుల్లో స్పాట్ ప్రవేశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు డిగ్రీ మార్కుల మెమో, బదిలీ, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

నియోజకవర్గంలో 'ఈనాడు'

★ ఉదయం 6గంటల నుంచి జీవీఎంసీ 36వ వార్డులోని ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయం, వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటన. – జ్ఞానాపురం, న్యూస్‌టుడే

కల్వర్టులను పట్టించుకోరా..!

అల్లిపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-4 ఇంజినీరింగ్ అధికారులు పని తీరుపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. ఇక్కడి జోనల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ ఈఈ, డీఈ, ఏఈలతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్లు సైతం అందుబాటులో ఉండరని గత కౌన్సెల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. వార్డుల్లోని సమస్యలను పట్టించుకోవడం లేదని పలువురు కూటమి కార్పొరేటర్లు, ప్రతిపక్ష కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలోని పలు వార్డుల్లో కల్వర్టులపై సిమెంటు పలకలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నింటిపై పలకలు కనిపించడం లేదు. దీనిపై గత జోనల్ కమిషనర్‌కు స్థానికులు వినతిపత్రాలు అందించినా స్పందన లేదు. జోనల్ కమిషనర్ ఆదేశాలను సైతం సిబ్బంది పట్టించుకోలేదు. రద్దీగా ఉండే రామకృష్ణ కూడలి, ఇందిరాప్రియదర్శిని స్టేడియం, పండ్ల మార్కెట్, కెప్టెన్ రామారావు కూడలి తదితర ప్రాంతాల్లో కల్వర్టులపై ఏళ్లుగా సిమెంటు పలకలు కనిపించడం లేదు. ఫలితంగా వీటి వెంబడి రాకపోకలు సాగించే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొంత మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికైనా జోన్-4 ఇంజినీరింగ్ అధికారులు స్పందించి కల్వర్టులపై పలకలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కెప్టెన్ రామారావు కూడలిలో..


రామకృష్ణకూడలి వద్ద కల్వర్టు ఇలా..

వాల్తేర్ రైల్వేలో 220 శ్రమదాన్ కార్యక్రమాలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని వాల్తేర్ డివిజన్‌లో అక్టోబరు 1 నుంచి 15 వరకు స్వచ్ఛతా పక్వాడాను విజయవంతంగా అమలు చేశామని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. డివిజన్ పరిధిలో పెద్ద ఎత్తున అవగాహన సదస్సులతోపాటు శ్రమదాన్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రైల్వే సిబ్బంది, ప్రయాణికులు, వాటాదారులు, ఎన్‌జీఓలతో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారన్నారు. స్టేషన్ పరిసరాల్లో పలు చోట్ల మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల విభజనపై దృష్టి సారించినట్లు తెలిపారు. వివిధ రైల్వే సంస్థలతో పాటు డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ లోకో షెడ్, కోచింగ్ కాంప్లెక్స్, కార్యాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. డివిజన్ వ్యాప్తంగా 2వేలకు పైగా వస్త్ర సంచులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. 250 మంది రైల్వే అధికారులు, 6వేల మంది సిబ్బందితో 220 శ్రమదాన్ డ్రైవ్‌లు నిర్వహించినట్లు తెలిపారు. రైల్వే పరిసరాల్లో చెత్తను వేసిన వారిపై 1356 కేసులు నమోదు చేసి సుమారు రూ.3 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు చెప్పారు.


స్వచ్ఛత పనుల్లో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

పలు రైళ్ల రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీ షెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విశాఖ (22870) ఎక్స్‌ప్రెస్ ఈనెల 15న ఉదయం 10 గంటలకు బదులు 2.30 గంటలు ఆలస్యంగా 12.30 గంటలకు.., నాందేడ్-సంబల్‌పూర్ (20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.30 గంటలకు బదులు 2.30 గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటలకు.., హావ్‌డా-ఎస్ఎంవీటీ బెంగళూరు(12863) సూ.ఫా. ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.50 గంటలకు బదులు 3.10గంటలు ఆలస్యంగా అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటలకు.., విశాఖ-కోర్బా(18518) ఎక్స్‌ప్రెస్ రాత్రి 9.50 గంటలకు బదులు 1.15గంటలు ఆలస్యంగా రాత్రి 10.20 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

ప్రత్యేక రైలు 12గంటలు ఆలస్యం: ఈనెల 15న ఉదయం 10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరాల్సిన షాలిమార్-సికింద్రాబాద్(07226) ప్రత్యేక రైలు 12 గంటలు ఆలస్యంగా రాత్రి 10 గంటలకు బయలుదేరింది.

విస్తృత పర్యటన.. సమస్యల పరిశీలన

వన్‌టౌన్, కార్పొరేషన్, అల్లిపురం– న్యూస్‌టుడే: స్థానిక సమస్యలపై సత్వరమే స్పందించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన 37వ వార్డులో తెదేపా, జనసేన, భాజపా కూటమి నాయకులతో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భజన కాలనీ, కొత్త అగ్రహారం, పెయిన్‌దొరపేట, గాంధీభవన్ కూడలి, గోడారిగోతులు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలువలపై పలకలు వేయాలని, తాగునీటి సరఫరా సమయం పెంచాలని, వీధి దీపాలు వెలిగేలా చూడాలని, ఆర్చీలు, సామాజిక భవనాల నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో శుభ్రత లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం తెదేపా కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్, విశాఖ లోక్‌సభ నియోజకవర్గ కమిటీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, మైనార్టీ విభాగ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రహమతుల్లా, మహమ్మద్ గౌస్, సలీం, జపురుల్లా, షేక్‌బాజ్జీ, అబ్దుల్ బాషా తదితరులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు.


అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తెదేపా నేతలు సీతంరాజు సుధాకర్, పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు

పీవీ సురేష్‌పై రౌడీషీట్ సరికాదు: వైకాపా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వైకాపా కార్పొరేటర్ పీవీ సురేష్‌పై రౌడీషీట్ తెరవడం సరికాదని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకులను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కేసులు పెడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ వైకాపా నేతలపై కుట్రపూరితంగా కేసులు పెడుతున్నారని, వాటికి తాము భయపడమన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నాయకులు రవిరెడ్డి, జాన్‌వెస్లీ, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహితను కాపాడిన పోలీసులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను నగర పోలీసులు కాపాడారు. భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోవటానికి మంగళవారం ఆర్కేబీచ్‌కు వచ్చింది. తీరంలో ప్రమాదకరంగా ఉండే ప్రాంతానికి వెళ్తుండగా, అక్కడే విధుల్లో ఉన్న బీచ్ మొబైల్ సిబ్బంది, లైఫ్‌గార్డులు గమనించి ఆమెను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళను కాపాడిన పోలీసు సిబ్బందిని సి.పి. శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

7 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడు రాష్ట్రానికి గంజాయి రవాణా చేసేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారని జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. మంగళవారం స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాలు గస్తీ కాస్తున్న సమయంలో ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు చెందిన త్రినాథ్ సీసా, అరుణ్ కంబార్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని సోదాలు చేశారు. వారి వద్ద ఉన్న బాగుల్లో 7.250 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కృషి, పట్టుదలతో కలలు సాకారం

సింధియా: విద్యార్థులు తమ కలల్ని సాకారం చేసుకునేందుకు కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. సామాజిక బాధ్యతతో భవనాన్ని నిర్మించిన కోరమాండల్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం ప్రయోగశాలలను పరిశీలించారు. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కోరమాండల్ అధికారులు జ్ఞానసుందరం, రెడ్డియ్య శ్రీనివాసరావు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

కూచిపూడి నృత్య వైభవం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: శరన్నవ రాత్రి ముగింపు కార్యక్రమంలో భాగంగా 76వ వార్డు నడుపూరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కళారాధన డ్యాన్స్ అకాడమీ కళాకారుల నృత్యవేదిక అలరించింది. సంప్రదాయ నృత్యాలు, వెంకటేశ్వరస్వామి వైభవ రూపకాలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ చూపిన కళాకారులకు జ్ఞాపికలు అందించారు. నాట్య గురువు తాళ్లపాక సందీప్‌కుమార్, శిక్షకుల్ని సత్కరించారు.


కళాకారులను సత్కరించిన కమిటీ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట వరకు

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గోపాలపట్నం

?: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. – నందకుమార్, చంద్రనగర్

✔: పరిశీలించి, కొత్తవి ఏర్పాటు చేస్తాం. –గోవిందరావు, వీధి దీపాల నిర్వాహకుడు

?: గోపాలపట్నం నుంచి సింహాచలం, పెందుర్తి వెళ్లే బీఆర్టీఎస్ రహదారిలో కొత్తగా ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలతో ప్రమాదాల బారిన పడుతున్నాం. –రాజశేఖర్, ప్రహ్లాదపురం

✔: వేగ నిరోధకాలపై తెల్లని పెయింటింగ్ వేయిస్తాం. –విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై, గోపాలపట్నం.

గోతుల దారుల్లో... బితుకు బితుకు..!

న్యూస్‌టుడే, పెదగంట్యాడ: గాజువాక శివారులో ఎక్కడికక్కడ శిథిలావస్థకు చేరిన రహదారుల్లో ప్రయాణమంటేనే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోడ్లపై అడుగు తీసి అడుగేయాలంటే ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు.

● జీవీఎంసీ 60 అడుగుల రోడ్డు నుంచి వెంపలినగర్‌కు వెళ్లే మార్గంలో అడుక్కో గొయ్యి మృత్యుకుహరాలుగా ఉన్నాయి. స్థానికులు పలుమార్లు శ్రమదానంతో గోతులు పూడ్చినా... వర్షాలకు పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోంది. జాతీయ రహదారి శ్రీనగర్ నుంచి విశ్వేశ్వరాయనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి.

● పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి ఉక్కు నిర్వాసితకాలనీల్లోనూ గత కొన్నాళ్ల నుంచి రోడ్లను గాలికొదిలేయడంతో నివాసితులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. చిన గంట్యాడ జగ్గు సెంటర్ నుంచి పాతకర్నవానిపాలెం మీదుగా దుర్గానగర్ వెళ్లే మార్గమూ అధ్వానంగా ఉంది.

● రహదారుల దుస్థితిపై జీవీఎంసీ జోన్-6 ఈఈ ఎంఆర్ఎస్ అప్పారావు వివరణ కోరగా... కొన్ని చోట్ల మరమ్మతులు చేపడుతున్నామని, మిగిలిన రహదారులకు టెండర్లు పిలిచామన్నారు.


పాతకర్నవానిపాలెంలో..


ఎక్కడికక్కడ శిథిలమై...

పందులు.. వీధుల్లో అవస్థలు..! — ఫోకస్

గాజువాక పరిసరాల్లో పందుల సంచారం మళ్లీ తీవ్రమైంది. జీవీఎంసీ ప్రజా ఆరోగ్య విభాగం సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో పెంపకందారులు ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లోకి వదిలేస్తున్నారు. వీధుల్లో గుంపుగా తిరుగుతున్న పందులు పలువురిపై దాడులు చేస్తూ, గాయపరుస్తున్నాయి.

■ ఆరు నెలల క్రితం పందుల డ్రైవ్ పేరిట నగర వ్యాప్తంగా అధికారులు కఠిన చర్యలు చేపట్టడంతో యజమానులు వేలాది పందుల్ని దూర ప్రాంతాలకు తీసుకెళ్లిపోయారు. ఇటీవల వాటిని తిరిగి తీసుకురావడంతో సమస్య మొదలైంది. ప్రస్తుత లెక్కల ప్రకారంగా గాజువాక జోన్‌లో 20 వేల వరకు పందులు ఉన్నాయి. సుమారు 80 కుటుంబాల వారు వాటిని పెంచుతూ, ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం సాగిస్తున్నాయి. గాజువాక, పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, షీలానగర్‌లో పందుల బెడదపై జీవీఎంసీకి ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గాజువాక



సంక్షిప్త సమాచారం..

● దుర్గమాంబ అనుపోత్సవం

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి దిబ్బపాలెం శ్రీ దుర్గమాంబ అనుపు ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బొర్రమాంబ స్టార్ గైస్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు యలమంచిలి అప్పారావు, ఈగల నర్సింగరావు, ఇల్లపు జువ్వాలు తదితరులు పాల్గొన్నారు.

● నేడు కూటమి సమావేశం

గాజువాక, న్యూస్‌టుడే : కూటమి పార్టీల సమావేశం బుధవారం యాదవజగ్గరాజుపేట గ్రీన్ సిటీ ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నట్టు గాజువాక తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఇతర పార్టీల ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు.

● ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగికి డాక్టరేట్

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : ఎన్ఎస్‌టీఎల్‌లో ప్రిన్సిపల్ ప్రైవేటు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం.రత్నకుమారికి కామర్స్‌లో డాక్టరేట్ దక్కింది. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఆమె పరిశోధనలు చేశారు. మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందడుగు


విజేతల్ని అభినందిస్తున్న పురోగామి, ట్వింకిల్ శ్యామ్ తదితరులు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : మహోన్నత విలువలు కలిగిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, భారత వ్యాపార దిగ్గజం రతన్ టాటా జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అమెరికాలోని సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధి పురోగామి అన్నారు. మంగళవారం 70వ వార్డు శ్రీనివాసనగర్ ట్వింకిల్ పాఠశాల ఆవరణలో అబ్దుల్ కలాం జయంతి, రతన్‌టాటా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. రేస్ ఆసుపత్రి ఎండీ వేగి హరి వెంకటేశ్, పాఠశాల ప్రిన్సిపల్ కరుణకుమారి, డైరెక్టర్ డి.శ్యామ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గాజువాక తెదేపా కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం, రతన్ టాటా చిత్రపటాలకు నివాళి అర్పించారు. పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు తమిరె శివప్రసాదరావు, కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, నాయకులు నాగేశ్వరరావు, బాలునాయుడు, గాంధీ, రాజారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


కలాం, రతన్‌టాటా చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు


కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరంలో...

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉక్కు ఉద్యమకర్త, దివంగత అమృతరావు పోరాట స్ఫూర్తిని నేటి కార్మికులు ఆదర్శంగా తీసుకుని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ పిలుపునిచ్చారు. అమృతరావు దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరంలో ఆయనకు నివాళి అర్పించారు. అమృతరావు సేవలు మరువలేనివని పలువురు అభిప్రాయపడ్డారు. కార్మిక నాయకులు రమణ, ప్రభాకర్‌రెడ్డి, నరేంద్ర, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకు 'నైపుణ్య పోటీలు'

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సాగర్‌నగర్: యువతలో నైపుణ్యాలు వెలికితీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర మంత్రి జయంత్ చౌధరి పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మూర్తి ప్రయోగశాల, మేకర్స్ స్పేస్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం, జాతీయస్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి నైపుణ్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ వర్సిటీలో బోధనతోపాటు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వై.గౌతమ్‌రావు, వైద్య కళాశాల ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్పీ రావు తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

నిత్యావసరాల ధరలు తగ్గించాలి : సీపీఐ


గాజువాకలో నిరసన ర్యాలీ

గాజువాక, న్యూస్‌టుడే : నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం గాజువాకలో నిరసన ర్యాలీ చేపట్టారు. సమితి కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు అచ్చుతరావు మాట్లాడారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి, కందిపప్పు, టమాట, పామాయిల్ తదితరాలు కొనుగోలు చేయలేక పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సభ్యులు పి.పోలయ్య, విష్ణు, దుర్గారావు, వనజాక్షి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : సామాన్య ప్రజలకు నిత్యావసరాల ధరలు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ పశ్చిమం సమన్వయకర్త కాండ్రేగుల సత్యాంజనేయ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం 61వ వార్డు మల్కాపురం బస్‌స్టాపు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బస్‌స్టాపు వరకు పాదయాత్ర నిర్వహించి, కరపత్రాలు పంచారు. పార్టీ నాయకులు జి.రాంబాబు, బి.సత్యానందరావు, పి.రాము, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మల్కాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇసుక సరఫరాకు మార్గదర్శకాలు

గాజువాక, న్యూస్‌టుడే : ఇసుక డిపో నుంచి సరఫరా ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని, ఎలాంటి ఆరోపణలకు ఆస్కారం ఇవ్వొద్దని జోనల్ కమిషనర్ బి.శేషాద్రి స్పష్టం చేశారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారి హరిదాస్, క్షేత్ర సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఇన్నాళ్లు తహసీల్దార్ పర్యవేక్షణలో ఇసుక నిర్వహణ ఉండేదని, ఇక నుంచి ఆ బాధ్యతలు జీవీఎంసీ పరిధిలోకి వచ్చినందున సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు అమలయ్యేలా చూడాలన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి ప్రజాదరణ : భాజపా


వివరాల నమోదులో నర్సింగరావు, తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే : కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ప్రజల్లో తగిన ఆదరణ ఉందని భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. మంగళవారం గాజువాక హైస్కూల్‌రోడ్డు, కాళికాంబనగర్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రియాశీల కార్యకర్తలతో పార్టీ బలోపేతమవుతోందన్నారు. నాయకులు బి.యల్లాజీరావు, రంగనాయకులు, విజయ, లావణ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ


పెదగంట్యాడలో..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పిల్లల చదువుపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని... అప్పుడే వారు సుశిక్షితులుగా తయారవుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. డిస్లెక్సియా(అభ్యాసన వైకల్యం) వారోత్సవాల సందర్భంగా మంగళవారం పెదగంట్యాడ భవిత కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖ అధికారి ఇ.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అక్షరాలు రాయడం, చదవడం, గుర్తించడంలో వెనుకబడిన పిల్లలపై దృష్టి సారించి, సాధన చేయించాలన్నారు. కేంద్రం ఉపాధ్యాయులు సూర్యనారాయణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించేలా పోటీలు నిర్వహించారు. వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.మోహన్‌రావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



91వ వార్డు లక్ష్మీనగర్‌లో..

ఖాతాదారులకు మెరుగైన సేవలు


శాఖను ప్రారంభిస్తున్న సీఓఓ హేమంత్‌కుమార్

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని కోస్టల్ బ్యాంకు చీఫ్ ఆపరేటింగ్ అధికారి పి.హేమంత్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని ఓ భవనం పైఅంతస్తులో ఉండే శాఖను కింద అంతస్తులోకి మార్చారు. మంగళవారం నిర్వహించిన కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తక్కువ వడ్డీపై ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఖాతాదారులకు సూచించారు. క్లస్టర్ హెడ్ వి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతు పనులకు శ్రీకారం

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహం మరమ్మతులకు రూ.11.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. మంగళవారం ఆయా పనులను కార్పొరేటర్ బొమ్మిడి రమణ ప్రారంభించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనానికి అన్ని హంగులు సమకూర్చి, వీలైనంత త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రజా పనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి, వసతి గృహం మేనేజర్ ఎ.మమత, వార్డు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఏడీకూడలి(కరాస), న్యూస్‌టుడే : కరాసలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశాన వాటిక అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ ఉపమేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ అధికారులతో కలిసి వాటికను పరిశీలించారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పనుల విభాగం ఏఈ ఉషారాణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

ఫార్మాసిటీలో విలువైన పల్లాడియం చోరీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మా సిటీలోని ఒక కంపెనీ నుంచి విలువైన లోహం పల్లాడియం చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫార్మా సంస్థలోని కెటలిస్టు (రసాయన చర్యను వేగవంతం చేయడానికి ఉత్ప్రేరకం)గా వినియోగిస్తారని తెలిసింది. గ్రాము విలువ వేలల్లో ఉంటుంది. ఆ కంపెనీని 40 రోజుల క్రితం నూతన యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. అయితే కంపెనీలో 4 కేజీల పెల్లాడియం చోరీకి గురైనట్లు గుర్తించిన యాజమాన్యం కొద్దిరోజుల క్రితం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పలువురు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం. కంపెనీలోని కొందరు ఉద్యోగులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పెల్లాడియం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా.

గెడ్డ పనుల పరిశీలన

కూర్మన్నపాలెం(వడ్లపూడి), న్యూస్‌టుడే : కణితి నిర్వాసిత కాలనీలో నిర్మిస్తున్న ప్రధాన గెడ్డ పనుల్ని మంగళవారం 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుకు సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడా మురుగు నిల్వ ఉండకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ ఎం.అప్పారావు, ఏఈ మహాలక్ష్మి, వార్డు నాయకులు, జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


వడ్లపూడిలో కాలువను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్, డీఈ అప్పారావు

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇంటర్ విద్యార్థి మృతి

మరో యువకుడికి తీవ్రగాయాలు


బొద్దపు హేమంత్ (పాతచిత్రం)

పరవాడ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన లంకెలపాలెం నుంచి పరవాడ వెళ్లే ప్రధాన రహదారిలోని రాంకీ ఫైర్‌స్టేషన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పరవాడ సీ.ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం ఈ.బోనంగి పంచాయతీ పరిధి బొద్దపువానిపాలేనికి చెందిన బొద్దపు హేమంత్ (16) ఉక్కునగరంలోని ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతి ఒరిజినల్ మార్కులిస్టును తెచ్చుకోవడానికి లంకెలపాలెంలోని పూర్వ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన బొద్దపు దశిధర్ (19)తో కలిసి ఇద్దరూ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. స్వగ్రామానికి తిరిగొస్తుండగా రాంకీ ఫైర్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి లారీని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం అనకాపల్లిలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే హేమంత్ మృతి చెందాడు. దశిధర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీ.ఐ వెల్లడించారు. మృతుడు హేమంత్ తండ్రి నాగరాజు పొక్లెయిన్ డ్రైవర్. తల్లి నాగమణి గృహిణి. అల్లారుముద్దుగా పెంచుకున్న పెద్దకుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


గాయపడిన బొద్దపు దశిధర్